హైదరాబాద్ వార్త



# "అవసరం" ఉన్నప్పుడే దాడులు..!

**-ఎక్సైజ్‌శాఖలోజోరుగా సాగుతున్న మామూళ్ల దందా**
**-లోపాలను ఎత్తిచూపుతూ యజమానులపై ఒత్తిళ్లు**
**-బార్లు,వైన్స్‌ల నుండి కిందిస్థాయి సిబ్బందితో కలెక్షన్లు**
**-చూసిచూడనట్లుగా వ్యవహరిస్తున్న ఉన్నతాధికారులు**



**హైదరాబాద్, మార్చి 16,ప్రభాతవార్త:**
ఇటీవల పోలీస్,రెవిన్యూ శాఖలతోపాటు ఎక్సైజ్ శాఖలోనూ వసూల్‌రాజాలు ఉన్నట్లు తెలుస్తుంది. ఈశాఖకు చెందిన కొంతమంది అధికారులు ఉన్నతాధికారులకు తెలియనివ్వకుండా..కింది స్థాయి సిబ్బందితో గుట్టుగా నెలవారి మూమూళ్లు వసూలు చేస్తున్నారు. వైన్స్‌లు,బార్లనుండి వ్యాపారుల లోపాలను ఎత్తిచూపుతూ వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు వినిసిస్తున్నాయి. జిల్లా ఆబ్కారీశాఖలో ఓస్థాయిలో ఉన్న అధికారులు గుట్టుగా నెలవారీ మూమూళ్లు వసూలు చేయిస్తున్నట్లు తెలుస్తుంది. తమ ఉన్నతాధికారులకు తెలియనివ్వకుండా గుట్టుగా దందా సాగిస్తున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి.తమ కిందిస్థాయి సిబ్బందితో ప్రతినెల మొదటివారంలో వైన్సుల నుండి నెలవారి మామూళ్లు వసూలు చేయిస్తున్నారు.ఏరియాలను బట్టి 10వేల ఈవసూళ్లు సాగుతున్నట్లు సమాచారం. మద్యం దుకాణాల ఏర్పాటు సమయంలోనే ఒక్కో దుకాణం నుండి 50-60వేలు వసూలు చేసినట్లు తెలిసింది. అదిపోనూ..ప్రతినెల వేలల్లో మామూళ్లు వసూలు చేయిస్తున్నారు.

గ్రేటర్ పరిధిలో 449వైన్స్‌లు ఉన్నాయి.హైదరాబాద్‌లో 194ఉండగా మిగతా విశివారు ప్రాంతాలైన రంగారెడ్డి మేడ్చెల్ జిల్లాల్లో ఉన్నాయి. అయితే దాదాపు చాలా ప్రాంతాల్లోని మద్యం దుకాణాలు నిబంధనలు తుంగలో తొక్కుతున్నాయి. చాలా ప్రాంతాల్లో మద్యం దుకాణాలు నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్నాయి .ఎమా ర్పీ ధరలను యథేచ్ఛగా ఉల్లంఘించడంతో పాటు దాదాపు ప్రతీ వైన్స్ బార్లలా మార్చేశారు. కేవలం పర్మిట్ రూమ్ ఉన్న వైన్స్‌ల్లో మాత్రమే మద్యం తాగేందుకు అనుమతించాల్సి ఉండగా.. ఈవిషయం నిబధనలకు పాతరేసి సికిం ద్రాబాద్,అంబర్‌పేట్, ఎల్బీనగర్, ఉప్పల్,ప్రాంతాల్లోని వైన్స్‌లను పరిశీలిస్తే బార్‌లను తలపిస్తుండటం ఇందుకు నిదర్శనంగా చెప్పొచ్చు. ఈవైన్స్‌లో రెండు మూడు గదులు ఏర్పాటు చేసి టేబుళ్లు ,కుర్చీలతో అచ్చం బార్లను తలపిస్తున్నాయి. అంతే కాకుండా మద్యం దుకాణాల్లో గ్లాసులు,తినుబండారాలు అమ్మొద్దని నిబంధనను ఏయజమాని పట్టించుకోకున్నా అధికారులు చూసీ చూడడనట్లుగా వ్యవహరిస్తుండటం గమనార్హం. నెలనెల మూళ్లకు అలవాటు పడిన ఎక్సైజ్ సిబ్బందికి గంపగుత్తగా డబ్బువస్తుండటంతో నిబంధనలను ఉల్లంగిస్తున్న యాజమాన్యాలను చూసీచూడనట్లుగా వదిలేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.

**'అవసరం'ఉన న్నప్పుడే దాడులు..**

నగరంలోని చాలా ప్రాంతాల్లో ఎక్సైజ్ నింబంధనలు పాటించని వైన్స్‌లు, బార్లు బస్తీల్లో బెల్ట్‌షాపులు ఏస్థాయిలో నడుస్తున్నాయో చెప్పనవసరం లేదు. వాటన్నింటిని అరికట్టాల్సిన అధికారులు తమకు అవసరం ఉన్నప్పుడే దాడులు చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. నెలవారీ మామూళ్ల విషయంలో తేడాలు వస్తేనే దాడులు చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇటీవల పోలీస్ అధికారులు దాడులునిర్వహిస్తే ప్రతి బస్తీల్లో అక్రమంగా వి క్రయిస్తున్న మద్యం లభ్యమౌతుంది. కింది స్థాయి ఎక్సైజ్ అధికారులకు సిబ్బందికి వీటి గురించి తెలిసినా..అరికట్టడం లేదన విషయం వీటితో స్పష్టమౌతుంది. కొంత మంది అధికారులు,సిబ్బందికి అత్యాశతీరడం లేదు. సర్కార్ ఇచ్చే వేత నాన్ని తలదన్నేలా..నెలనెల వేలకువేలు వసూలు చేస్తున్నారు. ఏసీబీ దాడు లు,సీసీ కెమెరాలు, స్మార్ట్‌ఫోన్ల నిఘా ఉన్నా.. భయం లేకుండా లంచా లు,మామూళ్లు తీసుకుంటున్నారు.

# సిటీలో రెండు కార్లు ఢీ

**-ఆ అర్ధరాత్రి ఏం జరిగింది?**
**-అందులో ఎవరున్నారు?**

**హైదరాబాద్, మార్చి 16 ప్రభాతవార్త**
నగర నడిబొడ్డున అర్ధరాత్రి రెండు కార్లు ఢీకొన్నాయి. మార్చి 15వ తేదీ బుధవారం అర్ధరాత్రి..మాదాపూర్ అయ్యప్ప సొసైటీ వంద అడుగుల రోడ్డులో ఈ యాక్సిడెంట్ జరిగింది. ఓవర్ స్పీడ్‌లో వెళుతున్న కార్లు.. అదుపు తప్పి ఢీకొన్నట్లు చెబుతున్నారు పోలీసులు. యాక్సిడెంట్ సమయంలో కారులోని ఎయిర్ బెలూన్స్ ఓపెన్ కావడంతో ఎవరూ గాయపడలేదు. ప్రాణాలతో బయటపడ్డారని పోలీసుల సమాచారం.రెండు కార్లలోనూ యువతీ యువకులు ఉన్నట్లు తెలుస్తుంది.ప్రమాదం జరిగిన వెంటనే వారు కార్లలో నుంచి దిగి వెళ్లిపోయారు. ఇద్దరు యువతులకు మాత్రం స్వల్పంగా గాయాలు అయ్యాయని..పెద్ద ప్రమాదం ఏమీ లేదంటున్నారు పోలీసులు. దెబ్బతిన్న కార్లను మాదాపూర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కార్లు ఢీకొన్న సమయంలో అందులోని యూత్..మందు కొట్టి ఉన్నారా లేదా అనేది స్పష్టం చేయాల్సి ఉంది. సిటీ నడిబొడ్డున..రద్దీగా ఉండే ఏరియాలో అర్ధరాత్రి రెండు కార్లు ఢీకొనటం చూస్తుంటే..రేసింగ్ జరిగిందా అనే అనుమానాలు సైతం వ్యక్తం అవుతున్నాయి. దీనికి కారణం..ఢీకొన్న కార్లు హైఎండ్ వెహికల్స్ కావడమే. కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేస్తున్నారు. పూర్తి వివరాలు వెల్లడి కావాల్సి ఉంది. కార్లలోని వారు ఎవరు..ఏం చేస్తుంటారు..ఎక్కడి నుంచి ఎక్కడికి వెళుతున్నారు అనే వివరాలపై విచారణ చేస్తున్నారు పోలీసులు. ఇద్దరు యువతులు స్వల్పంగా గాయపడినట్లు చెబుతునన పోలీసులు..వారి వివరాలు కూడా వెల్లడించాల్సి ఉంది.

# ఉరుములు, మెరుపులతో వర్షం

**-మరో రెండు రోజులూ వర్షాలే -చల్లబడి ఆహ్లాదకరంగా మారిన నగరం**





**హైదరాబాద్, మార్చి 16 ప్రభాతవార్త**
వాతావరణంలో మార్పులతో నగరంలో పలుచోట్ల ఇరుములు మెరుపులతో వర్షం కురిసింది. ఉత్తర-దక్షిణ ద్రోణి ప్రభావంతో అకాల వర్షాలు కురిశాయి. కొన్ని చోట్ల ఆకాశంలో మెరుపులు, మేఘాల గర్జనలకు జనం భయపడ్డారు. నగరంలోని యూసుఫ్‌గూడ, సోమాజిగూడ, అమీర్‌పేట, పంజాగుట్ట, బంజారాహిల్స్, ఖైరతాబాద్,హిమాయత్‌నగర్, నారాయణగూడ, బర్కత్‌పుర, అంబర్‌పేట, రామంతాపూర్, బోడుప్పల్,తార్నాక, విద్యానగర్, బేగంబజార్, కాటేదాన్, రాజేంద్రనగర్,అత్తాపూర్,గచ్చిబౌలి, హయత్‌నగర్, వనస్థలిపురం, దిల్‌సుఖ్‌నగర్, నాగోల్, ఎల్బీనగర్,మలక్‌పేట్,ముషీరాబాద్, సికింద్రాబాద్, బోయిన్‌పల్లి, జీడిమెట్ల, కూకట్‌పల్లి తదితర ప్రాంతాల్లో వర్షం కురిసింది. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ఆకాశం మేఘావృతం కావడంతో పట్టపగలే చీకట్లు కమ్ముకున్నాయి. ఈ వర్షంతో నగరంలో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. కొద్ది రోజులుగా ఎండలు దంచికొడుతున్నాయి. బయటకు రావాలంటేనే హడలెత్తిపోయేవారు. అలాంటిది ఒక్కసారిగా వాతావరణం చల్లబడడంతో గురువారం నగరవాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. వర్షం కురవడంతో నగరవాసులు ఎండ వేడిమి నుంచి ఉపశమనం పొందారు. మరోవైపు చేవెళ్ల ప్రాంతంలో ఈదురుగాలులతో కూడిన వడగళ్ల వర్షం కురిసింది.

శుక్రవారం, శనివారాల్లో చాలా చోట్ల వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిసింది. అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షం కురవచ్చని అంచనావేసింది. ఆ సమయం లో గాలులు వేగం గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల మేర ఉండటంతో పాటు వడగళ్ల వాన కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం హెచ్చరించింది.



# రంజాన్ పండుగకు అన్ని ఏర్పాట్లు చేయాలి

**-మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్**

**మెహిదీపట్నం, మార్చి 16, ప్రభాతవార్త :**
ముస్లీంలు ఎంతో పవిత్రంగా జరపుకునే రంజాన్ పండుగకు ప్రభుత్వ పరంగా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య, పాడి పరిశ్రల అభివృద్ధి, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అధికారులను ఆదేశించారు. గురువారం మాసబ్‌ట్యాంక్‌లోని పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో హోంమంత్రి మహమూద్ అలీతో కలిసి రంజాన్ ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో కలిసి సమీక్షా నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, మహమూద్ అలీలు మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత అన్ని పండుగలను ప్రజలు సంతోషంగా జరుపుకోవాలనే ఉద్దేశంతో సీఎం కేసీఆర్ ప్రభుత్వ పరంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగానే ప్రతి సంవత్సరం రంజాన్ పండుగకు ముస్లీంలు ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా అన్ని ఏర్పాట్లు చేయడం జరుగుతుందని తెలిపారు.



సమావేశంలో పాల్గొన్న మంత్రులు మహమూద్ అలీ, తలసాని శ్రీనివాస్ యాదవ్.

రంజాన్ పండుగలను పురస్కరించుకొని ముస్లీంలు నెల రోజులపాటు ఉపవాసదీక్షలు చేపడతారని తెలిపారు. సమావేశంలో కార్పొరేటర్లు కొలన్ లక్ష్మి, మహేశ్వరి, మాజీ కార్పొరేటర్లు అత్తిలీ అరుణగౌడ్, జోనల్ కమిషనర్ రవికిరణ్, శ్రీనివాస్‌రెడ్డి, వాటర్ వర్క్స్ డైరెక్టర్ కృష్ణ, జీఎంలు రమణారెడ్డి, హరిశంకర్, ఇఇలు సుదర్శన్, ఇందిరా, ఎలక్ట్రికల్ డిఈ శ్రీధర్, సుధీర్, హార్టికల్చర్ డిడి శ్రీనివాస్, ట్రాఫిక్ ఏసీపి జ్ఞానేందర్‌రెడ్డి, వక్స్‌బోర్డు చైర్మన్ ఉల్లాఖాన్ హాజ్ కమిటీ చైర్మన్ సలీం, వక్స్ బోర్డు సీఈఓ ఖాజా మైనోద్దున్, జీహెచ్‌ఎంసీ, వాటర్ వర్క్స్, ఎలక్ట్రికల్, శానిటేషన్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

# సెకండ్ ఇయర్ పరీక్షకు 2972 మంది గైర్హాజరు

**-పరీక్ష రాసిన 76,060మంది విద్యార్థులు**
**-జిల్లాలో ప్రశాంతంగా జరిగిన పరీక్షలు**



**హైదరాబాద్, మార్చి 16,ప్రభాతవార్త:**
ఇంటర్ సెకండ్ ఇయర్ పరీక్షలు మొదటిరోజు ప్రశాంతంగా జరిగాయి.హైదరాబాద్ జిల్లాలో 79,032 మంది సెకెండ్‌ఇయర్ విద్యార్థులు 79,032మంది ఉండగా ..అందులో 76,060మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. అలాగే 2972 మంది విద్యార్థులకు ఎగ్జామ్‌కు గైర్హాజరైనట్లు అధిఆధికారులు తెలిపారు.జిల్లాలో మొత్తం 233పరీక్షా కేంద్రాల్లో ఎగ్జామ్ నిర్వహించారు. ప్రతిపరీక్షా కేంద్రానికి ఒకఛీఫ్ సూరిడెంట్ ,ఒక డిపార్ట్‌మెంటల్ అధికారులను నియమించారు. అలాగే జిల్లా ఇంటర్మీడియట్ అధికారి కన్వీనర్‌గా గల ఐదుగురు సభ్యులతో కూడిన హైపర్‌కమిటీ పరీక్షల నిర్వాహణను పర్యవేక్షించింది. మాల్ ప్రాక్టీస్‌ను అరికట్టడానికి 4ఫ్లయింగ్ స్క్వాడ్స్ బృందాలను 8సిట్టింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేశారు. పరీక్షా కేంద్రాల సమీపంలో 144సెక్షన్ అమల్లో ఉంది. పరీక్షా కేంద్రాలకు విద్యార్థులు ఉదయం 8గంటలకే చేరుకుని సకాలంలో పరీక్షలకు హాజరైనట్లు అధికారులు చెప్పారు. అధికారులు బస్సులు సకాలంలో నడపడంతో విద్యార్థులు ఇబ్బందులు లేకుండా పరీక్ష హాల్‌కు చేరుకున్నారు. ప్రతి కేంద్రంలో విద్యార్థులకు పరీక్ష రాసుకోవడానికి టేబుళ్ల ఏర్పాటు ,త్రాగునీటిని సౌకర్యం వంటి మౌళికసదుపాయాలను అందుబాటులో ఉంచారు.

## అద్భుతంగా సాగిన కళాతపస్వికి 'స్వరాభిషేకం'

**చిక్కడపల్లి, మార్చి16 ప్రభాతవార్త:**
కళాతపస్వీ కె.విశ్వనాథ్‌కు ఘనంగా నివాళులు అర్పిస్తూ స్వర్వావాహిని సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు పి.వి.రావు, తనికెళ్ళ మీన ఆధ్వర్యంలో కళాతపస్వికి 'స్వరాభిషేకం' పేరుతో గురువారం రాత్రి చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలోని కళాసుబ్బారావు కళావేదికలో జరిగింది. విశ్వనాథ్ నిర్మించిన శృతిలయలు, శంకరాభరణం, స్వర్ణకమలం, స్వాతిముత్యం తదితర చిత్రాల నుంచి నంది అవార్డుగ్రహీత డి.సురేఖామూర్తి, చింతలపాటి సురేశ్, భరద్వాజ్, జ్యోతిర్మయి, సాయి, కిరణ్, నందిత తదితరులు అద్భుతంగా గానం చేసి అందరి నుంచి ప్రశంసలు అందుకున్నారు.

## చరిత్రకారుడు డాక్టర్ ఆనంద్‌రాజ్ వర్మ మృతి పట్ల సంతాపం

**హైదరాబాద్, మార్చి16 ప్రభాతవార్త:**
ప్రముఖ ఉర్దూ రచయిత, చరిత్రకారుడు డాక్టర్ ఆనంద్‌రాజ్ వర్మ మృతి పట్ల దక్కన్ హెరిటేజ్ అకాడమి చైర్మన్ మణికొండ వేదకుమార్ ఒక ప్రకటనలో తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేశారు. హైదరాబాద్‌చరిత్రపై అనేక పుస్తకాలు రాయటమే కాక 166 వ్యాసాలను సంకలనం చేశారని, ఆయన రాసిన హైదరాబాద్: మొహల్లా, గాలి ఔర్ కూచే' పుస్తకంలో హైదరాబాద్ ముఖ్యమైన ఏరియాల గురించి ఆసక్తికరమైన విషయాలను పొందుపరిచారని, ఈ పుస్తకాన్ని ఉర్దూలోకి కూడా అనువదించారన్నారు. ఆనంద్‌రాజ్‌వర్మతో సుదీర్ఘ అనుబంధం కలిగి ఉందన్నారు. ఆనంద్‌రాజ్ వర్మ ఎందరో చరిత్రకారులకు స్ఫూర్తి అని, ఆయన మృతి తనకు వ్యక్తితంగా తీరనిలోటని, హైదరాబాద్ చరిత్రపై ఆయన రచనల ద్వారా ఆయన పెంపొందించిన ఉత్తేజం స్ఫూర్తినిస్తూనే ఉంటాయన్నారు. ఆనంద్‌రాజ్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని సంతాపాన్ని తెలిపారు.

## సాఫ్ట్‌వేర్ ఉద్యోగం పేరిట భారీ మోసం

**శేరిలింగంపల్లి, మార్చి 16 ప్రభాతవార్త**
మాదాపూర్ హైటెక్ సిటీలో ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీ బోర్డు తిప్పేసింది. కొండాపూర్ ఏయంబి మాల్ ఎదురుగా యునైటెడ్ అలయన్స్ టెక్నాలజీ పేరుతో ముగ్గురు వ్యక్తులు ఐటీ కంపెనీ ఏర్పాటు చేసి భారీ మోసానికి పాల్పడ్డారు. వీరు సాఫ్ట్‌వేర్ జాబ్ పేరిట ఎంతోమంది నిరుద్యోగుల నుంచి లక్షల్లో డబ్బులు వసూలు చేశారు. కంపెనీ యాజమాన్యం ఒక్కొక్కరి వద్ద నుంచి లక్షన్నర నుంచి మూడున్నర లక్షల రూపాయలు వసూలు చేసినట్టు బాధితులు చెబుతున్నారు.జాబ్ ఇచ్చిన కంపెనీ నెల రోజుల పాటు ఆన్‌లైన్ ట్రైనింగ్ ఇచ్చింది. ట్రైనింగ్ పూర్తయిన నెల రోజులుగా కంపెనీ యాజమాన్యం నుంచి ఎటువంటి స్పందన రాకపోవడంతో బాధితులు కొండాపూర్‌కు వచ్చి ఆరా తీశారు. కంపెనీ మూతబడి ఉండటంతో బాధితులు మోసపోయినట్లు గుర్తించారు. వెంటనే మాదాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాగా ధీరజ్ ముత్యాల,అఖిల్, ఉషశ్రీ అనే ముగ్గురు వ్యక్తులు ఉద్యోగం ఇస్తామంటూ లక్షల్లో డబ్బులు వసూలు చేశారని బాధితులైన పవన్,రితీశ్,యతీశ్‌లు పోలీసుల ఫిర్యాదులో వెల్లడించారు. తమ బ్యాంకుల నుంచి డబ్బులు పంపించినట్టు బ్యాంకు అకౌంట్లతో సహా పోలీసులకు అందించారు. తమకు న్యాయం చేయాలని బాధితులు పోలీసులను కోరారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేట్టారు.

## పేపర్ లీకేజీలో కెటిఆర్‌ది ప్రధాన పాత్ర : బండి సంజయ్

**మలక్‌పేట, మార్చి 16 ప్రభాతవార్త :**
తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పేపర్ లీకేజీ వ్యవహారంలో మంత్రి కెటిఆర్‌కు ప్రధాన పాత్ర ఉందని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ఆరోపించారు. చంచల్‌గూడ జైల్‌లో రిమాండ్‌లో ఉన్న బిజెవైఎం నాయకులను ఆయన పరామర్శించారు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడుతూ లీకేజీని ప్రశ్నించిన బిజెవైఎం కార్యకర్తలను జైలులో బెయిల్ రాకుండా కేసులు పెట్టడం ఎంతవరకు న్యాయమో ఆలోచించాలన్నారు. పేపర్ లీకేజీ సంఘటనలో ఉన్న రేణుక కుటుంబం బిఆర్ఎస్ పార్టీకి చెందిన కుటుంబమని ఆరోపించారు. సిఎం కెసిఆర్ కుటుంబం లీకేజీ ప్రధాన పాత్ర వహించిందని ఆరోపించారు. సెట్‌లో వేసి ప్రతి కేసు పెండింగ్‌లో ఉంటున్నాయని, లీకేజీ కేసులో కూడా సిట్ వేయడం కూడా కేసును మాఫీ చేసేందుకేనని తెలిపారు. లీకేజీ ఐటి శాఖకు సంబంధించినదని, మంత్రి కెటిఆర్ రాజీనామా చేయాలన్నారు. కెటిఆర్ ముఖ్యమంత్రి కుమారుడు కాబట్టి కెసిఆర్ కాపాడుతున్నారని పేర్కొన్నారు. ఓయులో నిరసన తెలుపుతున్న విద్యార్థులను పోలీసులు అరెస్టు చేశారని వారిని బేషరతుగా వదిలివేయాలని డిమాండ్ చేశారు. బిజెపి, బిజెవైఎం నాయకులను జైళ్లకు పంపితే బెదిరేదిలేదని, మేము జైళ్లకు వస్తుంటాం, పోతుంటామని రాష్ట్ర వ్యాప్తంగా జైలులో మా కోసం ప్రత్యేక గదులు ఉంచండి, భయపడేది లేదని అన్నారు. ఎమ్మెల్సీ కవితకోసం జైలు సిద్దంగా ఉందన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న బండి సంజయ్

## ప్రజాసంక్షేమం పట్టించుకోని ప్రభుత్వాలకు బుద్ధి చెబుదాం

**నేషనల్ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఎం.అనిల్‌కుమార్ యాదవ్**

**ధర్నాచౌక్, మార్చి 16, ప్రభాతవార్త:**
ప్రజా సంక్షేమం పట్టించుకోని ప్రభుత్వాలకు బుద్ధి చెబుదామని నేషనల్ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఎం.అనిల్ కుమార్ యాదవ్ పిలుపునిచ్చారు. గురువారం ముషీరాబాద్ డివిజన్‌లోని పలు ప్రాంతాలలో ఆయన హాథ్ సే హాథ్ జోడో యాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ రాష్ట్రంలో బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తరువాత సామాన్య ప్రజలకు చేసిందేమీ లేదని ఆరోపించారు. కాంగ్రెస్ దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తే, బీజేపీ అధికారంలోకి వచ్చి ప్రభుత్వరంగ సంస్థలను అమ్మేందుకు కుట్రలు చేస్తూ దేశాభివృద్ధిని దెబ్బతీస్తున్నారని విమర్శించారు. బీజేపీ, బీఆర్ఎస్‌లు రెండూ ఒకే వైఖరిని అవలంభిస్తున్నాయని ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పోరేటర్ కల్పనా యాదవ్, స్థానిక కాంగ్రెస్ నేతలు అంజి యాదవ్, పాశం అనిల్‌కుమార్, ప్రవీణ్‌గౌడ్, రమేష్, కృష్ణగౌడ్, రాజ్‌దీప్, ప్రవీణ్‌రెడ్డి, సమీర్ తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్ చేపట్టిన కార్యక్రమాలను వివరిస్తున్న అనిల్‌కుమార్ యాదవ్

## దేశాభివృద్ధిలో వ్యవసాయ రంగం కీలకం





విద్యార్థినికి దృవపత్రాన్ని అందజేస్తున్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు.

**నిజాంపేట్,మార్చి16 ప్రభాతవార్త:**
వ్యవసాయ రంగం అభివృద్ధి పైనే దేశ పురోగతి ఆధారపడి ఉందని మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు అన్నారు. రామానాయుడు విజ్ఞానజ్యోతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో నాబార్డ్ సంస్థ సహకారంతో వ్యవసాయ రంగంలో నైపుణ్యాభివృద్ధిపై శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థుల స్నాతకోత్సవం జూబ్లీహిల్స్‌లో జరిగింది. బుధవారం నిర్వహించిన ఈ స్నాతకోత్సవానికి ముఖ్య అతిధిగా మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ఎంత ఎత్తు ఎదిగినా, ఎన్ని పదవులు చేపట్టినా మన మాతృభూమిని, మాతృభాషను కన్నతల్లిని ఎప్పుడూ మరిచిపోకూడదన్నారు. చదువుతో పాటు క్షేత్ర స్థాయిలో శిక్షణ పొందితేనే సంపూర్ణమవుతాయని,వ్యవసాయ రంగంలో చోటు చేసుకున్న మార్పులు, ఆధునిక పద్దతులును తెలుసుకోవడమే కాకుండా పండల్ల తోటల పెంపకం, పంట ఉత్పత్తులతో పాటు సారవంతమైన నేల తయారి తదితర అంశాలపై దృష్టి సారించాలన్నారు. అనంతరం విజ్ఞానజ్యోతి కళాశాలల అధ్యక్షుడు దగ్గుబాటి సురేష్‌బాబు మాట్లాడుతూ గ్రామీణ యువతను ఎంపిక చేసుకొని వారికి ఉచితంగా 6నెలల పాటు వ్యవసాయ రంగంలో శిక్షణను తమ సంస్థ ద్వారా కల్పిస్తున్నామన్నారు. అదే విధంగా నాబార్డ్ చీఫ్ జనరల్ మేనేజర్ సి.సుశీల మాట్లాడుతూ రామానాయుడు విజ్ఞానజ్యోతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ వ్యవసాయ రంగానికి చేస్తున్న కృషికి నాబార్డ్ తనవంతు సహాయ సహకారాలుఅందిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ అర్జున్‌రావు, విజ్ఞానజ్యోత సొసైటీ సభ్యులు రాజశేఖర్,దుర్గాప్రసాద్,అచ్యుత రాంప్రసాద్ పాల్గొన్నారు.

## కల్యాణలక్ష్మీ పేదింటి ఆడపడుచులకు వరం

**ఎమ్మెల్యే మదన్‌రెడ్డి**

**కౌడిపల్లి మార్చి 16 ప్రభాతవార్త** కల్యాణ లక్ష్మి పేదింటి ఆడపడుచులకు ఒక వరం లాంటిదని ఎమ్మెల్యే చిలుములు మదన్‌రెడ్డి అన్నారు. గురువారం కౌడిపల్లి మండల పరిషత్ కార్యాలయంలో కళ్యాణలక్ష్మి, షాదీము బారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే మదన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై 36 మంది లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రాజునాయక్, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు చిలుముల వెంకటేశ్వరరెడ్డి, జడ్పిటీసీ కవిత అమర్సింగ్, ఎంపిడీఓ శ్రీనివాస్, బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు సారారామాగౌడ్, డిప్యూటీ తహసీల్దార్ తారబాయి, కౌడిపల్లి ఉపసర్పంచ్ చంద్రం శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

### పుల్‌కుర్తి మాజీ సర్పంచ్ మృతి

**మనూర్, మార్చి 16, ప్రభాతవార్త:** మండలంలోని పుల్‌కుర్తి గ్రామ మాజీ సర్పంచ్ పోతుల సత్తమ్మ బుధవారం అనారోగ్యంతో అనంత లోకాలకు చేరిపోయారు. గతంలో గ్రామ సర్పంచ్‌గా గ్రామాభివృద్ధికి ఎంతో కృషి చేశారని, సత్తెమ్మ మృతి గ్రామంతో పాటు కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని మాజీ ఎంపి, టిపిసిసి ఉపాధ్యక్షులు సురేశ్‌కుమార్ శెట్కార్, టిపిసిసి ఉపాధ్యక్షులు పట్లోళ్ల సంజీవరెడ్డిలు అన్నారు. సత్తమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించి సత్తెమ్మ కుటుంబానికి అండగా ఉంటామన్నారు.

### వీర బ్రహ్మేంద్ర స్వామి ఆలయ నిర్మాణ భూమి పూజలో కృష్ణారెడ్డి

**పటాన్‌చెరు, మార్చి16 ప్రభాతవార్త:**

బొల్లారం మున్సిపల్ పరిధిలోని బీసీ కాలనీలో విశ్వ బ్రాహ్మణ సంఘం నాయకుల సంక్షేమాన్ని కాంక్షిస్తూ కాలనీలో వీర బ్రహ్మేంద్ర స్వామి ఆలయ నిర్మాణ భూమిపూజ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఆనంద్ కృష్ణారెడ్డి హాజరయ్యారు. పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి సంఘం నాయకులతో కలిసి గురువారం భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనంద్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ ఆలయ నిర్మాణం పూర్తయ్యే వరకు ప్రతి నెలా నిర్వహించే అన్నదాన కార్యక్రమానికి తన వంతుగా ప్రతి నెలా 50 కిలోల బియ్యాన్ని ఇస్తానని హామీ ఇచ్చారు. ఆనంద్ కృష్ణారెడ్డి నిర్ణయం పట్ల ఆలయ కమిటీ సభ్యులు ఆనందం వ్యక్తం చేసి ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు వి. చంద్రారెడ్డి, కె. బాల్‌రెడ్డి, స్థానిక కౌన్సిలర్లు, భరత్ చారి, ఆలయ కమిటీ సభ్యులు, ఆయా పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### దేవాలయాల అభివృద్ధికి సంపూర్ణ సహకారం

**-ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి**



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

**పటాన్‌చెరు, మార్చి16 ప్రభాతవార్త:**

పటాన్‌చెరు నియోజకవర్గంలో నూతన దేవాలయ నిర్మాణాలకు సంపూర్ణ సహకారం అందించడంతో పాటు పురాతన ఆలయాలను జీర్ణోద్ధరణ చేస్తున్నామని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. బొల్లారం మున్సిపల్ పరిధిలోని బీసీ కాలనీలో నూతనంగా నిర్మించనున్న శ్రీశ్రీశ్రీ మద్విరాట్ పోతులూరి వీర బ్రహ్మేంద్ర స్వామి దేవాలయం భూమిపూజ కార్యక్రమానికి ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు చంద్రారెడ్డి, బాల్‌రెడ్డి, పార్టీ మున్సిపల్ అధ్యక్షులు హన్మంత్‌రెడ్డి, ఆయా వార్డుల కౌన్సిలర్లు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### దర్గాలో ఘనంగా ఉర్సు ఉత్సవాలు



దర్గాలో ఉర్సు ఉత్సవాలు నిర్వహిస్తున్న దృశ్యం

**చౌటకూరు, మార్చి 16, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన చౌటకూరులో ఉర్సు ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. గ్రామంలోని ఖాన్ ఖాదర్ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేసి ఉత్సవాలను ప్రారంబించారు. మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన భక్తులు దర్గాకు చేరుకుని దర్గాకు దట్టీలు కప్పి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దర్గాకు చేరుకున్న భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అన్నా సాగర్ పీఠాధిపతి ఖలీల్ హుస్సేన్, హైమద్ పాషా తదితరులు పాల్గొన్నారు.

### ప్రతి దళిత కుటుంబానికి దళితబంధు వర్తింపజేయాలి

**ఆమ్ ఆద్మీపార్టీ నియోజకవర్గం కన్వీనర్ మిట్టపల్లి రాజేశ్వర్**

**హత్నూర మార్చి 16,ప్రభాతవార్త:**

ప్రతి దళిత కుటుంభానికి దళితబంధు పథకం వర్తింపజేయాలని ఆమ్ ఆద్మీపార్టీ నర్సాపూర్ నియోజకవర్గం కన్వీనర్ మిట్టపల్లి రాజేశ్వర్ డిమాండ్ చేశారు. గురువారం హత్నూర మండలం దౌల్తాబాద్‌లో విలేకరులతో మాట్లాడుతూ కొందరికికే పథకం ఆమలు చేయడం సబబు కాదని, అన్ని దళిత కుటుంభాలకు ఆమలు జరిగేలా చర్యలు తీసుకో వాలని అన్నారు. సంచారజాతుల వారికి డబుల్ బెడ్‌రూమ్‌ల పథకం ఆమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.వీటితో పాటు అర్హులైన ప్రతిఒక్కరికి డబుల్ బెడ్‌రూమ్‌లు ఇవ్వాలని మిట్టపల్లి రాజేశర్వర్ డిమాండ్ చేశారు. నియోజకవర్గంలోని రంగంపేటను మండలంగా ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజల ఆకాంక్షల మేరకు మండలం ను ప్రకటించాలని అన్నారు.

### ఆర్థిక సాయం అందజేత

**సదాశివపేట, మార్చి 16, ప్రభాతవార్త:** గత కొంత కాలంగా అనారోగ్యంతో అవస్థలు పడుతున్న జర్నలిస్టుకు జర్నలిస్టు అసోసియేసన్ బాధ్యులు తమ వంతు చేయుత అందచేశారు. మండల పరిధిలోని నిజాంపూర్ గ్రామానికి చెందిన పాత్రికేయులు విజయ్‌కుమార్ అనారోగ్యంతో అవస్థలు పడుతూ వస్తున్నారు. విషయం తెలుసుకున్న సదాశివపేట ప్రింట్ మీడియా అసోసియేషన్ గురువారం విజయ్‌కుమార్ ఇంటికి చేరుకుని ఆరోగ్య పరిస్థితిని అడగితెలుసుకున్నారు. విజయ్‌కుమార్‌కు 10వేల రూపాయల ఆర్థిక సహాయం అందించి పరామర్శించి భవిష్యత్తులోనూ జర్నలిస్టులకు అసోసియేషన్ అండగా ఉంటుందని అసోసియేషన్ అధ్యక్షులు వెంకటేశం గౌడ్ భరోసా ఇచ్చారు. జర్నలిస్టు కుటుంబాలకు త్వరలో ఉనే ఆర్థిక, ఆరొగ్య భద్రతకు ఇన్సురేన్స్ భీమా సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు విశ్వనాతం, బషీర్, శేకర్, వెంకట్ పాల్గొన్నారు.

### పేదలు సీఎం రిలీఫ్ ఫండ్‌ను సద్వినియోగం చేసుకోవాలి

**కీసర, మార్చి16, ప్రభాతవార్త:** నిరుపేదలు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు.గోదుమకుంట గ్రామానికి చెందిన గుల్లని శ్రీ లేఖకి 60 వేల రూపాయలు,కౌడే క్రిష్ణకి 40 వేల రూపాయలు మంజూరు అయింది. గురువారం క్యాంపు కార్యాలయంలో చెక్కులను మంత్రి మల్లారెడ్డి లబ్దిదారులకు అందజేశారు.

## ప్రభుత్వ అసమర్థతతోనే పేపర్ లీకేజీ

**-టిపిసిసి సభ్యులు వై నరోత్తం**

**జహీరాబాద్, మార్చి 16, ప్రభాతవార్త:** ప్రభుత్వ అసమర్థత మూలంగానే టీఎస్‌పిఎస్సీ నిర్వహించాల్సి ఉన్న ఏఈ ప్రశ్నపత్రాలు లేకేజి అయ్యాయని టిపిసిసి సభ్యులు వై నరోత్తం ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం పట్టణంలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో నరోత్తం మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ ఏర్పడి 8 సంవత్సరాలు పూర్తయినా రెండు మార్లు అధికారం చలాయించిన బిఆర్ఎస్ నిరోద్యోగ సమస్యలను పరష్కరించడంలో విఫలమయిందని ఆరోపించారు. ఉద్యోగుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేయడం, కోర్టుకు వెళ్లడం సాకుతో ఉద్యోగ ప్రక్రీయ ముందుకు సాగలేకపోయిందని విచారం వ్యక్తం చేశారు. అసిస్టెంట్ ఇంజీనిరింగ్ 837 పోస్టుల భర్తీకి ఈ నెల 5న నిరుద్యోగులు రాతయ పరీక్షలకు హాజరుకాగా ప్రశ్న పత్రం లీక్‌కావడంతో పరీక్షలు ఆగిపోయాయన్నారు. పరీక్ష రాసిన 55వేల మంది అభ్యర్థులు అయోమయంలో కొట్టుమిట్టాడాల్సిన వస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఒక్కో అభ్యర్థి ఉద్యోగం కోసం ధరఖాస్తు చేసుకునేందుకు 2 వేల రూపాయల వరకు చెల్లించుకున్నారని వాపోయారు. పేపర్ లీకేకి కారకులై కఠిన చర్యలు తీసుకోవాలని నరోత్తం డిమాండ్ చేశారు.

## రైతులు నీటిని సక్రమంగా వినియోగించుకోవాలి: ఎమ్మెల్యే



నీటి కాల్వను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి

**సిర్గాపూర్, మార్చి 16 ప్రభాతావార్త:** ఆయకట్టు రైతులంతా, నీటిని అందరికి అందేలా సద్వినియోగం చేసుకోవాలని నారాయణఖేడ్ ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడి అన్నారు. గురువారం సిర్గాపూర్ మండల పరిధిలోని సుల్తానాబాద్ గ్రామంలో గల నల్లవాగు మద్య తరహ ప్రాజెక్టు కెనాల్ ద్వారా రైతుల పొలాలకు నీటి పారుదలను ఖేడ్ ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ రైతు సోదరులు తమ ఒక్కరి పొలమే కాకుండా చివరి ఆయకట్టు వరకు నీరు అందాలంటే తమ పొలాలలో కెనాల్‌లో ఆడ్డుకట్ట వేయకూడదని అధికారులను రైతులను ఆదేశించారు. అడ్డుకట్ట వేస్తే తమకే మరొక తడికి నీరు ఉండదుకనక నీటిని సక్రమంగా వినియోగించుకోవాలని అన్నారు. వారితో పాటుగా మండల ఎంపీపీ జార మహిపాల్‌రెడ్డి కల్హేర్ మండల ఎంపీపీ తనయులు జలేందర్, మాజీ ఎంపీటీసీ కృష్ణాగౌడ్; పార్టీసినియర్ నాయకులు కిషన్‌రెడ్డి,మారపు సాయిలు, ఇరిగేషన్, ఎ.ఇ. రవి, రైతు సోదరులు తదితరులు ఉన్నారు.

### ప్రత్యేక పూజలు చేసిన బిఆర్ఎస్ నేత రాజు



దర్గాను దర్శించుకుంటున్న బిఆర్ఎస్ నేత రాజు దృశ్యం

**సదాశివపేట, మార్చి 16, ప్రభాతవార్త:** మండలంలోని కంబాలపల్లి గ్రామంలోని గొట్పల్లి పీర్లను, ఎంకెపల్లి గ్రామంలోని నల్లపోచమ్మ తల్లిని బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు పులిమామాడి రాజు గురువారం దర్శించుకున్నారు. దర్గాలో ఉర్సు ఉత్సవాలు ప్రారంభం కావడంతో రాజు దర్గాకు చేరుకుని తమ మొక్కుబడిలో భాగంగా దర్గాకు దట్టీని సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దర్గాకు చేరుకున్న భక్తులకు అన్నదానం కోరకు రాజు 150 కిలోల బియ్యాన్ని దర్గా కమిటి సభ్యులకు అందచేశారు. ప్రజలు చల్లగా ఉండేలా ఆశీర్వదించాలని అల్లాను వేడుకున్నట్లు పులిమామిడి రాజు సూచించారు.

### నల్లపోచమ్మకు ప్రత్యేక పూజలు

ఎంకెపల్లి గ్రామంలో నల్లపోచమ్మ ఆలయ ఆవరణలో కథ భాగవతం కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. గ్రామానికి చేరుకున్న రాజును ఆలయ కమిటి ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికారు. ఆలయంలో రాజు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండేలా దీవించాలని వేడుకున్నట్లు రాజు పేర్కొన్నారు. అంతరించి పోతున్న కళాసంస్కృతులను కాపాడేందుకు కళాకారులు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు.

### మండలంలో జోరుగా వడగళ్ల వాన

**న్యాల్‌కల్, మార్చి 16, ప్రభాతవార్త:** గురువారం మధ్యాహ్నారం ఒకే సారి మేఘాలు కమ్ముకుని వడగళ్లు, ఈదురగాలుతో కూడిన భారీ వర్షం కురిసింది. మండలంలోని ఆయా గ్రామాల్లో కురిసిన భారీ వర్షానికి మామిడి చెట్లకు అంతంగా పూసిన కాయలు నేలరాలిపోయాయి. వడగండ్లతో కూడిన వర్షం కురుస్తుండటంతో ఆయా గ్రామాల్లోని ప్రజలు తమ ఫోన్‌లలో దృశ్యాలను బంధించి సోషల్ మీడియలో ప్రచారం చేశారు. గురువారం మధ్యాహ్నం నుంచి వాతావరణం సల్లగా మారి పోయింది.

### ఘనంగా ప్రారంభమైన పలుగుమీది పోచమ్మ ఉత్సవాలు



ఉత్సవాలలో పాల్గొన్న భక్తులు

**హత్నూర మార్చి 16,ప్రభాతవార్త:**

హత్నూర మండలం శేర్‌ఖాన్‌పల్లి గ్రామపరిధిలోని పలుగుమీది పోచమ్మ దేవాలయం వారోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి.ఈనెల 20 వరకు జరిగే బ్రహ్మోత్సవాలు మొదటి రోజున ఘనంగా ప్రారంభమయ్యాయి. ప్రారంభోత్సవాలను దేవాలయ చైర్మేన్ సుదర్శన్‌గౌడ్,సర్పంచ్ లక్ష్మినారాయణ,ఇఓ శశిధర్, పాలక మండలి సభ్యులు కలిసి ప్రారంభోత్సవాలలో పాల్గోన్నారు. మండలంలోని వివిద గ్రామాల భక్తులతో పాటు ఇతర జిల్లాల భక్తులు కూడ అధిక సంఖ్యలో పాల్గోన్నారు.

### ఘనంగా పాఠశాల వార్షికోత్సవం

**నారాయణఖేడ్, మార్చి 16 ప్రభాతవార్త:** నారాయణఖేడ్ పట్టణంలోని అంకుర్ స్కూల్లో వార్షికోత్సవ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థిని విద్యార్థులు వివిధ వేషదారణలో చేసిన తెలంగాణ డ్యాన్సులు స్కిట్లు పాటలు పలువురికి ఆకర్షించాయి. అనంతరం కరస్పాండెంట్ రామచంద్రం, ప్రిన్సిపాల్ ప్రకాష్‌లు మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లలను ప్రోత్సహించడం చాలా మంచి పరిణామమని ఇదే స్ఫూర్తితో నారాయణఖేడ్ పట్టణంలో అద్భుతమైనటువంటి ఫలితలు సాధిస్తూ అంకుర్ స్కూల్ పిల్లలు అన్ని రంగాల్లో రాణించేలా ప్రోస్తహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



పట్టణంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని జరుపుకుంటున్న దృశ్యం

## పట్టణంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం

**సదాశివపేట, మార్చి 16, ప్రభాతవార్త:** అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని గురువారం పట్టణంలోని 11, 13వార్డులలో బసవ సేవా సదన్‌లో మహంకాళి సమైఖ్య ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు పులిమామిడి రాజు సతీమణి పులిమామిడి మమత హాజరై మాట్లాడారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాల్సిన అవసర ఉందని మమత సూచించారు. కుట్టు మిషన్ శిక్షణ, మగ్గం వర్క్ లాంటి పనులలో నైపుణ్యం పొందాలని, తమ కాళ్లపై తాము నిలబడేలా ప్రతి మహిళ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ రాజేశ్వరి, మప్మా శాఖ సీఓ రమాదేవి, టిఎల్‌ఫ్ అధ్యక్షురాలు కల్పన, కార్యదర్శి వరలక్ష్మి, కోశాధికారి పద్మ, మహంకాళి సమైఖ్య అధ్యక్షురాలు పద్మ, కార్యదర్శి కవిత, కోషాధికారి అరుణ తదితరులు పాల్గొనగా పిఎంఆర్ ఫౌండేషనన ఆధ్వర్యంలో సమావేశంలో పాల్గొన్న మహిళలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

## ఉపాధిహామీలో ఎక్కువ మంది కూలీలకు పని కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డిఆర్‌డిఓ శ్రీనివాసరావు

**హత్నూర మార్చి 16,ప్రభాతవార్త:** ఉపాదిహామీ పథకంలో ఏక్కువమంది కూలీలకు ఉపాది కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని డిఆర్‌డిఓ శ్రీనివాస్‌రావు అన్నారు. గురువారం హత్నూర మండల పరిషత్ కార్యలయంలో నిర్వహించిన సమీక్షసమావేశంలో డిపిఓ సురేష్ మోహన్‌తో కలిసి పాల్గోన్నారు.ఈసందర్భంగా డిఆర్‌డిఓ మాట్లాడుతూ వ్యవసాయ పనులు తగ్గినందున వ్యవసాయ కూలీలకు పనులు కల్పించాలని అన్నారు. దీనికి అవసరమైన అవగాహన కార్యాక్రమాలు నిర్వహించాలని అన్నారు. ఉపాధిహామీ పనులలో ఏక్కువ మంది కూలీలు పాల్గోనేందుకు, సంబందిత అధికారులు ప్రజాప్రతినిధులతో కలిసి పనిచేయాలని అన్నారు. డిపిఓ సురేష్‌మోహన్ మాట్లాడుతూ ఈనెల ఆఖరు వరకు నిర్ధేశించిన ఇంటి పన్నులను వందశాతం వసూలు చేయలని సూచించారు.ట్రేడ్‌లైసెన్సులు మంజూరుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో ఎపిడి వామనరావు,జయదేవు,ఎంపిఓ సువర్ణ,ఎపిఓ,పంచాయతీ కార్యదర్శులు, టిఎలు, ఫీల్డ్‌అసిస్టెంట్లు పాల్గోన్నారు.



సమావేశంలో పాల్గొన్న పంచాయతీ కార్యదర్శులు,టిఎలు

### పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు



పొట్టి శ్రీరాములకు నివాళులు అర్పిస్తున్న దృశ్యం

**సదాశివపేట, మార్చి 16, ప్రభాతవార్త:** దేశ ప్రజలకు పొట్టి శ్రీరాములు అందించిన సేవలు ఎనలేనివని వాసవి క్లబ్ అధ్యక్షులు బుగ్గారాం శ్రీనివాస్ అన్నారు. గురువారం పట్టణంలో పొట్టి శ్రీరాములు జయంతిని పురష్కరించుకుని ఏర్పాటు చేసిన కార్యక్రమంంలో పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి పూజా కార్యక్రమాలు నిర్వహించి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు బూష అశోక్ కుమార్, ప్రధాన కార్యదర్శి బాసెట్టి పాండురంగం, యువజన సంఘం అధ్యక్షులు దడిగే నగేష్, రేగళ్ల అశోక్, మనిసాని శంకర్ తదితరులు పాల్గొన్నారు.

**ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ..**

**సంగారెడ్డి మున్సిపాలిటి మార్చి 16,ప్రభాతవార్త:**

ఆమరజీవి పొట్టి శ్రీరాములు జయతిని మురస్కరించుకొని గురువారం సంగారెడ్డిలోని ఐబివద్దగల ఆమరవీరుల స్తూపంవద్ద జిల్లా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నివాళులు ఆర్పించారు.రాష్ట్రం ఏర్పాటులో పొట్టి శ్రీరాములు త్యాగాన్ని గుర్తు చేసుకున్నారు. ఆర్యవైశ్య మహసభ రాష్ట్ర ఉపాధ్యాక్షులు తోపాజి అనంతం కిషన్, కోంపల్లి విద్యాసాగర్, మ్యాడం రాదాకిషన్, పి.ప్రకాష్, శ్రీధర్, భాస్కర్, తోపాజి హరీష్,మధుసూధన్,ఆనంద్,జి.సంతోష్ తదితరు పాల్గొన్నారు.

### తునికి నల్లపోచమ్మ హుండీ లెక్కింపు

**కౌడిపల్లి మార్చి 16 ప్రభాతవార్త** తునికి గ్రామ శివారులోగల శ్రీనల్లపోచమ్మ హుండీ ఆదాయం రూ.8.17,127ల వచ్చినట్లు ఆలయ కార్యానిర్వాహణ అధికారి మోహన్‌రెడ్డి తెలిపారు.గురువారం గడిచిన నాలుగు నెలలకు సంబంధించి సుంకి నల్లపోచమ్మ హుండీ ఆదాయాన్ని దేవాదాయ ధర్మాదాయ శాఖ ఇన్‌చార్జి అసిస్టెంట్ కమిషనర్ శివరాజ్ ఆధ్వర్యంలో తునికి ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు లెక్కించగా రూ8.17,127 వచ్చినట్లు ఈఓ తెలిపారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లాల దేవాదాయ దరా్మదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శివరాజ్ మాట్లాడుతూ తునికి అమ్మవారి హుండీ ఆదాయాన్ని అమ్మవారి పేరున్న బ్యాంక్ ఖాతాలో వేసి ఆలయ అభివృద్ధికి ఖర్చు చేస్తామని ఆన్నారు.



హుండీని లెక్కిస్తున్న దృశ్యం



పాస్టర్స్ అసోసియేషన్ బాధ్యులకు సన్మానిస్తున్న దృశ్యం

## పాస్టర్ అసోసియేషన్ సభ్యులకు సన్మానం

**సదాశివపేట, మార్చి 16, ప్రభాతవార్త:** సంగారెడ్డి నియోజకవర్గం పాస్టర్స్ అసోసియేసన్ సభ్యులను గురువారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శివరాజ్ పాటిల్ మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా సమాజంలో పనులు చేయాల్సిన అవసరం ఉందన్నారు. అన్ని కులమతాల వారికి తాను అందుబాటులోఉంటున్నట్లు వివరించారు. కార్యక్రమంలో సినిమా హీరో కార్తీక్, బిజెపి జిల్లా కార్యదర్శి సారా కృష్ణ, మండల అధ్యక్షులు బ్రహ్మానందరెడ్డి, నాయకులు శ్రీకాంత్, మోహన్, బిజెవైఎం మండల అధ్యక్షులు అంజి, నాయకులు, పాస్టర్లు పాల్గొన్నారు.

### విగ్రహ ప్రతిష్టాపనకు రెండున్నర లక్షల విరాళం



విరాళం అందజేసిన నీలం మధు ముదిరాజ్‌ను సన్మానిస్తున్న దృశ్యం

**రామచంద్రాపురం, మార్చి 16, ప్రభాతవార్త:** దేవాలయాలు నిర్మిస్తే ప్రజలకు దైవ దర్శనం చేసుకుంటూ ఆధ్యాత్మికంతో ఆరోగ్యంగా జీవించే అవకాశాలు ఉంటాయని బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, చిట్కుల్ సర్పంచ్ నీలం మధు ముదిరాజ్ అన్నారు. గురువారం తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని న్యూ ఎంఐజి కాలనీలో ప్రతిష్టించిన కాలభైరవ స్వామిని నీలం మధు దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న నీలం మధును ఆలయ మర్యాదలతో ఘనంగా స్వాగతం పలికారు. ఆలయంలో వేద బ్రాహ్మణులు వేద మంత్రాలు వల్లిస్తుండగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కాలభైరవ విగ్రహ ప్రతిష్టాపనకు నీలం మధు ముదిరాజ్ తన వంతుగా రెండున్నర లక్షల రూపాయలను అందించారు. ఆలయాల అభివృద్ధికి తన వంతు సహకారం ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో రవిచారి, మాజీ డైరెక్టర్ వీరేశషలింగం, నీవన్, అశ్విన్, దుర్గా వెంకట్‌రెడ్డి, పండు, సురేష్ ముదిరాజ్, అనిల్, తల్లారి మధు ముదిరాజ్, బ్రహ్మాచారి, విశ్వకర్మ సభ్యులు, ఎన్‌హెంఆర్ యువసేన సభ్యులు పాల్గొన్నారు.

## వేర్వేరు మండలాల్లో గుర్తు తెలియని మృతదేహాలు లభ్యం

**జహీరాబాద్, మార్చి 16, ప్రభాతవార్త:** పట్టణంలోని పశువుల మార్కెట్ ముందర ఓ గుర్తు తెలియని వృద్ధుడి శవాన్ని గుర్తించినట్లు ఎస్ః కె శ్రీకాంత్ తెలిపారు. ఎస్ఐ కథనం ప్రకారం... మధ్యాహ్నాం 3 గంటల ప్రాంతంలో గుర్తు తెలియని వృద్ధుడు (65) సంవత్సరాల వ్యక్తి అనారోగ్యంతో సహజంగా మరణించి ఉండవచ్చన్నారు. గత కొన్ని రోజులుగా వృద్ధుడు పట్టణంలోని ఆయా ప్రాంతాల్లో సంచరిస్తూ బిక్షాటన చేస్తూ కాలాన్ని వెళ్లదీసినట్లు ప్రజలు పేర్కొన్నారన్నారు. బట్టలు మాసిపోయి ఉన్నాయని, తెల్లటి గడ్డం పెరిగి ఉందన్నారు. ఎర్రటి శ్వెటర్, బ్లూ రంగు ట్రాక్ సూ ట్, కాళ్లకు రబ్బరు చెప్పులు, ఎడమ చేతికి గడియాం ఉందన్నారు. మృత దేహానికి పోస్టుమార్టం నిర్వహించి శవాన్ని ప్రభుత్వ ఆస్పత్రిలోని మార్చురీలో భద్రపర్చినట్లు ఎస్ఐ వివరించారు. శవాన్ని ఎవరైనా గుర్తిస్తే జహీరాబాద్ టౌన్ ఎస్ 8712656763కి సమాచారం అందించాలని ఎస్ఐ శ్రీకాంత్ సూచించారు.

### సంగారెడ్డి పట్టణంలో..

**సంగారెడ్డి టౌన్, మార్చి 16, ప్రభాతవార్త:** సోమవారం మార్కెట్ వెనుకాల ఓ గుర్తు తెలియని మహిళ శవాన్ని పోలీసులు గురువారం కనుగొన్నారు. పట్టణ ఎస్ఐ ఎస్ శ్రీధర్‌రెడ్డి కథనం ప్రకారం... గురువారం మధ్యాహ్నాం 12.30 గంటల ప్రాంతంలో పట్టణంలోని గంజి మైదాన్, సోమవారం వార్కెట్ వెనుకాల గల మహబూబ్ సాగర్ చెరువులో గుర్తు తెలియని మహిళ (25-30) సంవత్సరాలు గల మహిళ చెరువులో కుళ్లిపోయి ఉంది. ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేసి కాళ్లు,చేతులు, మెడ ఒకే దగ్గర కట్టి గోనే సంచిలో వేసి చెరువలో పారేసి ఉంటారని, చెరువులో శవం పూర్తిగా కుళ్లిపోయి గుర్తు పట్టలేనట్లుగా ఉందన్నారు. మొహమ్మద్ హాజీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు. శవాన్ని ఎవరైనా గుర్తిస్తే సంగారెడ్డి పట్టణ పోలీసు ఠాణా 08455-276333, ఎన్‌పెక్టర్ 8712656718కు సమాచారం అందించాలని ఎస్ఐ శ్రీధర్‌రెడ్డి తెలిపారు.

### మహిళలు ఆర్థికంగా ఎదగాలి: ఎమ్మెల్యే



చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి

**సిర్గాపూర్, మార్చి 16 ప్రభాతవార్త:** మహిళలు ఆర్థికంగా ఎదగాలని నారాయణఖేడ్ ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి అన్నారు. గురువారం సిర్గాపూర్ మండల కార్యాలయంలో ఎంపీపీ జారమహిపాల్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో సిర్గాపూర్ మండల మహిళా సంఘాలకు సున్నా వడ్డీ చెక్కుల సర్ఫ్ గ్రామీ ణాభివృద్ధి శాఖ సంఘాలు 80 లక్షల 53000వేల రూపాయాలు ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఎంపీపీ ఉపాధ్యక్షురాలు పరగ్‌బాయి మాధవారావు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు ఏపీఎం చంద్రశేఖర్,మండల సమైఖ్య మరియు గ్రామ సంఘాలు మరియు రైతు సమన్వయ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

### హత్ సే హత్ జోడో కార్యక్రమం

**బొంరాస్‌పేట్, మార్చి16, ప్రభాతవార్త** ః కాంగ్రేస్‌పార్టీ ఆధ్వర్యంలో హత్ సే హత్ ఓడో కార్యక్రమాన్ని గురువారం నాడు మాజీ మండల అధ్యక్షులు జయకృష్ణ చేపట్టారు. రైతులకు 2లక్షల వ్యవసాయ లోన్ల మాఫీ, నిరుపేదలకు ఇంటి నిర్మాణంవంటి విషయాలను గ్రామంలో ఇంటింటికి తిరిగి కాంగ్రేస్ పార్టీ అధికారంలోకి వస్తే ఏమేమి చేస్తుందో, గతంలో చేసిన వాటిని ప్రజలకు వివరించారు. అలాగే బిఆర్ఎస్ పార్టీ మోసాలను కూడా ప్రజలకు వివరించారు.

### కంటి వెలుగును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలి

**కీసర, మార్చి16, ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలందరూ వినియోగించుకొని విజయవంతం చేయాలని నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు.గురువారం మున్సిపల్ పరిధిలోని 8 వార్డులో కంటి వెలుగు కార్యక్రమాన్ని చైర్మన్ పరిశీలించారు.ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి కంటి పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పౌరులందరికి ఐ స్క్రీనింగ్ చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో 8 వార్డు కౌన్సిలర్ కౌకుట్ల మమత క్రిష్ణారెడ్డి, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.


బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ప్రసన్నకుమార్, అశ్విన్‌దలాల్, శ్రీలక్ష్మీ తదితరులు

## 19న నెక్లెస్‌రోడ్‌లో "రేస్ ఫర్ 7"

**హైదరాబాద్, మార్చి 16,ప్రభాతవార్త:** అరుదైన వ్యాధులపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఆర్గనైజేషన్ ఫర్ రేర్ డిసీజెస్ ఇండియా ఆధ్వర్యంలో "రేస్ ఫర్ 7" పేరుతో మారథాన్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ప్రసన్నకుమార్ తెలిపారు. ఈనెల 19న నెక్లెస్‌రోడ్‌లోని పీపుల్స్ ప్లాజా నుంచి 7కిలోమీటర్ల మేర నడక ఉంటుందని తెలిపారు. దీనికి సంబంధించిన బ్రోచర్‌ను సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఓఆర్‌డి డైరెక్టర్ అశ్విన్ దలాల్, క్యూరిఎస్‌ఎంఏ ఇండియా డైరెక్టర్ శ్రీలక్ష్మీ,ప్రతినిధి రాహులన విపర్తి తదితరులలతో కలిసి ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో ఏడువేలకు పైగా అరుదైన వ్యాధులు ఉన్నాయన్నారు. ఎనమిది శాతం వీటితో బాధపడుతున్నారని పేర్కొన్నారు. ఈవ్యాధులను గుర్తించేందుకు సుమారు ఏడేల్లు పడుతుందని, అవగాహన కల్పించడం కోసమే ఈమారథాన్‌నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

## టెన్నిస్‌లో టిఎస్ఎస్‌పిడిసిఎల్‌కు అవార్డులు


బహుమతులు అందజేస్తున్న సిఎండీ రఘుమారెడ్డి

**హైదరాబాద్, మార్చి 16,ప్రభాతవార్త:** తెలంగాణ ట్రాన్స్‌కో, డిస్కమ్స్ ఇంటర్ సర్కిల్ టెన్నిస్ టోర్నమెంట్‌లో ట్రాన్స్‌కో, దక్షిణ డిస్కం, ఉత్తర డిస్కంలకు చెందిన వివిధ ఉద్యోగులు మార్చి 9నుంచి 11వరకు ఎల్బీ స్టేడియంలో నిర్వహించిన టెన్నిస్ టోర్నమెంట్‌లో పాల్గొన్నారు. ఈ పోటీల్లో దక్షిణడిస్కం టీం ఓపెన్ డబుల్స్‌లో మొదటిస్థానాన్ని,సింగిల్స్ లో రెండోస్థానాన్ని కైవసం చేసుకుంది. దీంతోఆపటు దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ టీం ఓవరాల్ ఛాంపియన్ షిప్ అవార్డు కూడా దక్కించుకుంది. ట్రాన్స్‌కోకు చెందిన విద్యుత్ సౌధ టీం ఓవరాల్ ఛాంపియన్ షిప్‌లో రన్నరప్‌గా నిలిచింది. ఈటోర్నమెంట్‌లో అవార్డులకు దక్కించుకున్న విజేతలను దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ ఛైర్మన్, సిఎండీ రఘుమారెడ్డి గురువారం తన ఛాంబర్‌లో అభినందించారు. ఈ కార్యక్రమంలో విజేతలు ఎం.వెంకటేశ్వర్లు, కె.వి ప్రభాకర్‌రావు, ఎం.రిషికేష్, టిఎస్‌పిడిసిఎల్ కార్పొరేట్ ఆఫీస్ స్పోర్ట్స్‌కౌన్సిల్ జనరల్ సెక్రటరీ ఆర్.నర్సింగ్, వైస్ ప్రెసిడెంట్ బిఆర్ నాయక్‌లు ఉన్నారు.

## మున్సిపల్ కార్మికులతో ఏఐటియుసి సమావేశం


బాచుపల్లి వార్డు కార్యాలయం వద్ద కార్మికులతో ఏసురత్నం

**నిజాంపేట్, మార్చి 16 ప్రభాతవార్త:** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్మికుల జీతాల విషయంపై బాచుపల్లి వార్డు కార్యాలయంలో గురవారం మున్సిపల్ కార్మికులతో ఏఐటీయూ సమావేశం ఏర్పాటు చేసింది. సమావేశానికి ముఖ్య అతిధులుగా ఏఐటీయూసి రాష్ట్ర అధ్యక్షుడు ఏసురత్నం,మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు రాము పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించడానికి ఎర్రజెండా ఎల్లప్పుడు ముందుంటుందన్నారు. గత రెండు నెలలుగా కార్మికులకు జీతాలు ఇవ్వకపోవడం బాధాకరమని, వెంటనే వారి జీతాలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జీతాలు విడుదల చేయకుంటే అంబేద్కర్ జయంతి తరువాత ఇందిరా పార్కు వద్ద పెద్ద ఎత్తున ధర్నా చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు, ఏఐటీయూసి నాయకుడు పాలబిందెల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచంలో శాంతిస్థాపనకు కృషి : తిప్పర్తి యాదయ్య


తిప్పర్తి యాదయ్యను సత్కరించిన దృశ్యం

**చిక్కడపల్లి, మార్చి 16 ప్రభాతవార్త:** అఖిలభారత శాంతి యువజన సంఘీభావ సంఘంజాతీయ ఉపాధ్యక్షులుగా తెలంగాణ మున్సిపల్ కార్మిక సంఘం అధ్యక్షుడు, తెలంగాణ విద్యావంతుల వేదిక ప్రధాన కార్యదర్శి, జిహెచ్ఎంసి సర్కిల్-15 డిప్యూటీ కమిషనర్‌గా కొనసాగుతున్న డాక్టర్ తిప్పర్తి యాదయ్య నియమితులయ్యారు. ఇటీవల పంజాబ్ రాజధాని ఛండీగడ్‌లో జరిగిగిన జాతీయ మహాసభలో ఆయన జాతీయ ఉపాధ్యక్షులుగా ఎన్నికయ్యారు. ఈ నేపధ్యంలో తిప్పర్తి యాదయ్యను మున్సిపల్, ఉద్యోగ,కార్మిక సంఘాలు, విద్యావంతుల వేదిక నేతలు ఘనంగా సత్కరించి అభినందించారు. తిప్పర్తి యాదయ్య మాట్లాడుతూ ప్రపంచంలో శాంతిస్థాపన కోసం తమ సంఘం పనిచేస్తుందని అన్నారు.దేశాల మధ్య యుద్ధాలు జరగకుండా శాంతిస్థాపన, అభివృద్ధి కోసం పనిచేస్తున్నామన్నారు. యుద్ధ ద్వారా ఆస్తి, ప్రాణ, ధన నష్టం జరుగుతుందని, ఫలితంగా ప్రపంచ దేశాల మధ్య అవగాహన కల్పించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ప్రపంచ దేశాలపై అమెరికా పెత్తనం చేయడం వల్ల యుద్ధాలు జరుగుతున్నాయన్నారు. జాతీయ మహాసభలో 15దేశాల ప్రతినిధులు, దేశం నుంచి అన్ని రాష్ట్రాల నుంచి శాంతిసంఘం సభ్యులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఉద్యోగ, కార్మిక సంఘం నేతలు పాల్గొన్నారు.

## మహిళాభ్యున్నతికి స్వచ్ఛంద సంస్థల సేవలు అభినందనీయం

### ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్

**ధర్నాచౌక్, మార్చి 16, ప్రభాతవార్త:** మహిళాభ్యున్నతికి స్వచ్ఛంధ సంస్థలుచేస్తున్న సేవలు అభినందనీయమని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ కొనియాడారు. గురువారం కవాడిగూడలోని బండనగర్‌లో అప్స ఆధ్వర్యంలో, అమ్మ ఫౌండేషన్ సహకారంతో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని వివిధ రంగాలలో సేవలు అందిస్తున్న మహిళలను సత్కరించారు. అనంతరం పేద గర్భిణీ మహిళలకు సామూహిక సీమంతం నిర్వహించారు. కానిస్టేబుల్ శ్రీవాణి, కరోనా సమయంలో వైద్య సేవలు అందించిన మెడికల్ అధికారి రాజ్యలక్ష్మి, చిక్కడపల్లి గ్రంథాలయ ఛైర్మన్ ప్రసన్నారామ్మూర్తి, ఈశ్రమ్ నమోదులో సేవలు అందించిన రజని ఐసీడీఎస్ సూపర్ వైజర్ ఉమా తదితరులు ఎమ్మెల్యే చేతుల మీదగా సత్కారం అందుకున్నారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అనిల్‌కుమార్, అరుణ, అప్స ప్రాజెక్ట్ మేనేజర్ ప్రవీణ్ హజారే, అప్స సామాజిక కార్యకర్తలు బొట్టు రమేష్, శ్రావణి, లావణ్య, స్థానిక బీఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు.


మహిళలను సత్కరిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్


మాట్లాడుతున్న ఇ.టి.నర్సింహా. చిత్రంలో చాయాదేవి తదితరులు ఉన్నారు

## పశ్నాపత్రాల లీకేజిలకు రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలి

### సిపిఐ నేత నర్సింహ డిమాండ్

**సైఫాబాద్, మార్చి 16 ప్రభాతవార్త:** టిఎస్‌పిఎస్సీలో తరుచు ప్రశ్నాపత్రాలు లీకేజ్ వల్ల రాష్ట్రంలోని నిరుద్యోగ యువత హక్కులు హరించబడుతున్నాయని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఇ.టి.నర్సింహ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రశ్నాపత్రాల లీకేజీ వ్యవహారంలో రాష్ట్ర ప్రభుత్వమే పూర్తిగా బాధ్యత వహించి హైకోర్టు జడ్జిచే న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. గురువారం సత్యనారాయణరెడ్డి భవన్‌లో సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యవర్గ విస్తృతస్థాయి సమావేశంలో ఆయన ముఖ్యఅతిధిగా పాల్గొని ప్రసంగించారు. జూనియర్ ఇంజనీర్, టౌన్‌ప్లానింగ్ పరీక్షా పత్రాలు లీక్‌పై కేసును సిట్‌కు బదిలీ చేస్తే ఉపయోగం ఉండదని చెప్పారు. ప్రశ్నాపత్రాల లీకేజిని నిరోధించడంలో టిఎస్‌పిఎస్సీ పూర్తిగా విఫలం చెందిందని, పారదర్శకత లోపించిందని, అక్రమాలు పెరిగాయని, అసమర్ధత కొనసాగుతున్నదని అందువల్ల తక్షణమే టిఎస్‌పిఎస్సీ బోర్డును రద్దుచేయాలని డిమాండ్ చేశారు. గుడిసేవాసులకు ఇళ్ళపట్టాల కోసం, డబుల్ బెడ్‌రూమ్‌ల కోసం నగరంలో ఉద్యమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమావేశంలో సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఎస్.చాయాదేవి, సహాయ కార్యదర్శులు బి.స్టాలిన్, కమతం యాదగిరి, నాయకులు జి.చంద్రమోహన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## 4డివిజన్‌లో పర్యటించిన మేయర్


కంటి వెలుగు కేంద్రంలో మేయర్ కొలన్ నీలాగోపాల్‌రెడ్డి

**నిజాంపేట్,మార్చి 16 ప్రభాతవార్త:** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 4వ డివిజన్ ప్రగతినగర్ సీనియర్ సిటీజన్ పార్కులో ఉన్న రెండవ విడత కంటి వెలుగు కేంద్రాన్ని గురువారం మేయరల్ కొలన్ నీలాగోపాల్‌రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా కంటి వెలుగు కేంద్రం వైద్యులను, పరీక్షల నిమిత్తం వచ్చిన స్థానికులతో సదుపాయాల్లో ఎవైనా లోపాలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. స్థానికులకు పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కళ్ళజోళ్ళు, మందులను పంపిణీ చేయాలని వైద్యులకు సూచించారు.

**మరో కార్యక్రమంలో...**

కార్పొరేషన్ పరిధిలోని 4వ డివిజన్‌లోని డాక్టర్స్ కాలనీ నందనవనం పార్కును మేయర్ కొలన్ నీలాగోపాల్‌రెడ్డి సందర్శించి అభివృద్ధి పనులను పరిశీలించారు. అనంతరం పార్కు సుందరీకరణ పనులపై దృష్టి పెట్టాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఇంఛార్జి కమిషనర్ రామకృష్ణారావు, కార్పొరేటర్లు జి.శ్రీనివాస్‌యాదవ్, శ్రీరాములు, డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు మురళీధర్‌యాదవ్, మెడికల్ ఆఫీసర్ అజీజ్‌ఖాసిం, ఏఈ లక్ష్మీనారాయణ, ఇంజనీరింగ్ అధికారులు, వైద్యులు శ్రీచంద్రిక, నాగమణి, రమేష్, సాయిరాం, సీ నియర్ సిటీజన్స్, కాలనీవాసులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీని కలిసిన మున్నూరుకాపు సంఘం సభ్యులు


సంఘం సభ్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు

**కొంపల్లి, మార్చి16 ప్రభాతవార్త:** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దూలపల్లి గ్రామానికి చెందిన మున్నూరు కాపు సంఘం నూతన కార్యవర్గ సభ్యులు బుధవారం మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నూతన కార్యవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేసి వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు మంత్రి రఘునాథ్, ఉపాధ్యక్షుడు బర్మా శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి శివ, కార్యదర్శులు కిషోర్, మహేష్, కోశాధికారి వెంకటేష్, కార్య నిర్వాహక సభ్యులు నాగరాజు, సత్యనారాయణ,వెంకటేష్, రుషిరాజ్, అశోక్, ప్రవీణ్, సతీష్, పెంటయ్య, డి.నాగరాజు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## గుండెపోటుపై అవగాహన అవసరం - వెంకటేశ్వర్లు

మెహిదీపట్నం, మార్చి 16, ప్రభాతవార్త : గుండెపోటుపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందని హైదరాబాద్ జిల్లా అడిషనల్ కలెక్టర్ ఎం. వెంకటేశ్వర్లు తెలిపారు. నేడు వయస్సుతో సంబంధం లేకుండా గుండెపోటు వస్తుండడం ఆవేదన కలిగించే విషయమన్నారు. ఆసిఫ్‌నగర్ తహీల్దార్ కార్యాలయంలో గురువారం ఇండియన్ రెడ్‌క్రాస్ ఆర్గనైజేషన్ ఆధ్వరంలో గుండెపోటుపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎం. వెంకటేశ్వర్లు హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు... మానవుని జీవన ప్రమాణాలు రోజురోజుకు పడిపోతున్నాయన్నారు. వత్తిడికి గురవుతూ ప్రతి ఒక్కరు జీవితాన్ని గడుపుతుండడంతోనే నేడు అనేక రోగాలు వస్తున్నాయన్నారు. వయస్సుతో సంబంధం లేకుండా గుండెపోటు వస్తుండడం ఆవేదన కలిగించే విషయమన్నారు. గుండెపోటు బాధితులను కాపాడుకోవా లంటే సీపీఆర్‌పై అవగాహన ఎంతో అవసరమన్నారు. సీపీఆర్‌పై అవగాహన ఉంటే గుండెపోటు బాధితులను కాపాడుకునే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. ఇండియన్ రెడ్‌క్రాస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం సంతోషించదగిన విషయమన్నారు. ప్రతి ఒక్కరు ఇలాంటి అవగాహన కార్యక్రమాలకు హాజరై సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆసిఫ్‌నగర్ తహశీల్దార్ ఫర్హీన్ షేక్, డిప్యూటీ తహశీల్దార్ ప్రదీప్‌రెడ్డి, ఆర్ఐ. సునీల్, ఇండియన్ రెడ్‌క్రాస్ ఆర్గనైజేషన్ సభ్యులు భీమ్ రెడ్డి, డాక్టర్ విజయ్ భాస్కర్, రవి, రెవెన్యూ అధికారులు, సిబ్బంది, మెడికల్ స్టాఫ్ పాల్గొన్నారు.



మెహిదీపట్నంలో రంజాన్ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతున్న సానియామీర్జా చెల్లెలు ఆనమ్ మీర్జా. చిత్రంలో అజారుద్దీన్ కుమారుడు అసదుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# హుస్నాబాద్ బిడ్డనే : ఎమ్మెల్యే సతీష్‌కుమార్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే సతీష్‌కుమార్

**హుస్నాబాద్, మార్చి 16, ప్రభాతవార్త :**

అవగాహన లేని నేతలు తనను హుస్నాబాద్‌కు చెందిన వాడిని కాదంటూ ఆరోపిస్తున్నారని కానీ తాను 'పక్కా లోకల్‌బిడ్డ'నేనని ఎమ్మెల్యే వొడితెల సతీష్ కుమార్ విపక్షాలకు తగిన పంచ్‌తో కూడిన కౌంటర్‌ను ఇచ్చారు. హుస్నాబాద్‌లో ఆయన మంత్రి కెటిఆర్ పర్యటన సందర్భంగా సన్నాహక సమావేశాన్ని నిర్వహించిన అనంతరం క్యాంపు కార్యాలయంలో మాట్లాడారు. ఇకనైనా విపక్షాలు తమ రాజకీయ ప్రాపకం కోసం ఇష్టానుసారంగా మాట్లాడడం సరికాదని నిజాలు తెలుసుకుని మాట్లాడాలన్నారు. హుస్నాబాద్ ప్రాంతంలోని చెరువులకు మరమ్మతులుచేసి నీళ్ల నింపిన ఘనత బిఆర్ఎస్‌దేనన్నారు. దీంతోపాటు మెట్ట ప్రాంతంలోని లక్షఎకరాలకు సాగునీటిని అందించే లక్ష్యంతో గౌరవెల్లి ప్రాజెక్టును రీడిజైన్ చేసి పను లనువేగవంతం నెలరోజుల్లోనే అందించబోతున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ ప్రాజెక్టు విషయంలో ప్రతిపక్షాలు అనవసర రాద్ధాంతం చేసి నిర్వాసిత రైతాంగాన్ని రెచ్చగొట్టడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో పార్టీ మండల అధ్య క్షుడు వంగ వెంకటరామిరెడ్డి, పట్టణ అధ్యక్షుడు అన్వర్, జిల్లా వైస్ చైర్మన్ రాయిరెడ్డి రాజారెడ్డి, ఎంపిపి లకావత్ మానససుభాష్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఎడబోయిన రజిని తిరుపతిరెడ్డి, సర్పంచ్ గంగం మధన్మోహన్‌రెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్ తిరుపతిరెడ్డి, బిఆర్ఎస్‌వి నాయకులు సూరంపల్లి పర్శరాం, కామిరెడ్డి క్రాంతి, చిరంజీవి పాల్గొన్నారు.

**డబుల్‌బెడ్‌రూం ఎంపికలో అక్రమాలు జరిగితే ఫిర్యాదు చేయండి...**

హుస్నాబాద్‌లో నిర్మించిన డబుల్ బెడ్‌రూంల లబ్దిదారుల ఎంపికలో అవినీతి జరిగితే ప్రజలు భయం లేకుండా ఫిర్యాదు చేయాలని ఎమ్మెల్యే సతీష్‌కుమార్ అన్నారు.అక్రమాలు జరిగినట్లు నిరూ పణ అయితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుం టామని, అక్రమం జరిగినట్లు ఫిర్యాదులు వస్తే పోలీసుల ద్వార ప్రత్యేక దర్యాప్తు చేపిస్తామన్నారు.

**హుస్నాబాద్‌కు బండి సంజయ్ ఏం చేశాడు...!?**

కరీంనగర్ పార్లమెంట్ సభ్యునిగి గెలిచిన బండి సంజయ్ హుస్నాబాద్ అభివృద్ధికి ఏం చేశారని ఎమ్మెల్యే సతీష్‌కుమార్ ప్రశ్నించారు. గురువారం అక్కన్నపేటలో ఈనెల 20న మంత్రి కేటీఆర్ పర్య టించనున్న నేపద్యంలో పార్టీ శ్రేణులతో కలసి సన్నాహక సమావేశం ఏర్పాటు చేయనున్న బహి రంగసభను విజయవంతం చేయాలని పిలుపుని చ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గౌరవెల్లి ప్రాజెక్టులో భూములు కోల్పోయిన నిర్వాసితులకు 100శాతం న్యాయం చేశామని వారి సహకారంతోనే వచ్చే నెల రోజుల్లో ప్రాజెక్టు పనులు పూర్తిచేసుకోబోతున్నామన్నారు. కొంతమంది ప్రతి పక్షాలు ఈ ప్రాజెక్టు పూర్తయితే వారికి రాజకీయ భవిష్యత్తు ఉండదనే నెపంతో కావాలనే తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. నిర్వాసితు లకు రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా పరిహారం పొందింది గౌరవెల్లినిర్వాసితులేనని స్పష్టం చేశారు. 126 మీటర్ల ఎత్తులో ఉన్న గౌరవెల్లి ప్రాజెక్టులోకి పంప్‌హౌజ్ ద్వార ట్రయల్‌రన్ సక్సెస్ చేసుకున్నామని గుర్తు చేశారు.

ఎల్కతుర్తి నుండి సిద్దిపేట మీదుగా జాతీయ రహదారిని మంజూరు చేయిం చిన ఘనత మాజీ ఎంపి వినోద్‌కుమార్‌కే దక్కు తుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పెసరు సాంబరాజు, ఎంపిపి మాలోతు లక్ష్మీభీలునాయక్, జడ్పిటిసి మంగ శ్రీనివాస్, మార్కెట్ చైర్‌పర్సన్ ఎడబోయిన రజినితిరుపతి రెడ్డి, ఆయాగ్రామాల సర్పంచ్‌లు పాల్గొన్నారు.

**సిఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులు పంపిణీ**

అక్కన్నపేట మండలానికి చెందిన 18 మంది అనారోగ్యనికి గురై ప్రయివేట్ ఆసుపత్రిలో చికిత్స పొంది అయిన ఖర్చులను ఎమ్మెల్యే సతీష్‌కుమార్ సహాయం ద్వార ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకోగా మంజూరైన 5లక్షల 29వేల200ల విలువైన చెక్కులను ఎమ్మెల్యే స్థానిక ప్రజాప్రతినిధులతో పంపిణీ చేశారు.

## తెలంగాణ రాష్ట్ర సగర సంఘం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

### ఘనంగా మంత్రి శ్రీనివాస్‌గౌడ్ జన్మదిన వేడుకలు

**సైబరాబాద్ ప్రతినిధి, మార్చి 16 ప్రభాతవార్త**

తెలంగాణ రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ జన్మదిన వేడుకలను పురస్కరించుకొని తెలంగాణ రాష్ట్ర సగర సంఘం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. సగర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పరి శేఖర్ సగర ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని రాష్ట్ర సగర సంఘం కార్యాలయంలో నిర్వహించిన ఈ రక్తదాన శిబిరంలో యువత పెద్దఎత్తున పాల్గొని రక్తదానం చేశారు. రక్తదాన శిబిరాన్ని టియుడబ్ల్యుజె రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అస్కాని మారుతి సాగర్ ముఖ్యఅతిధిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మారుతి సాగర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర మంత్రి శ్రీనివాస్‌గౌడ్ జీవితం యువతకు ఆదర్శమన్నారు. ఓ ప్రభుత్వ అధికారిగా ఉంటూ తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో కీలక పాత్ర పోషించి, అంచెలంచెలుగా ఎదిగి రాష్ట్ర మంత్రిగా కొనసాగడం పట్ల బిసిలు గర్వపడుతున్నారన్నారు. సగరులకు అండగా ఉంటున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పలు సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం నుంచి సహకారం అందిస్తున్నారని అన్నారు. సగర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పరి శేఖర్ సగర మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమం నుంచి సగరులు మంత్రి శ్రీనివాస్‌గౌడ్ వెంట ఉన్నారని, రాష్ట్రంలో బిసిలకు శ్రీనివాస్‌గౌడ్ పెద్దదిక్కుగా ఉన్నారన్నారు. సకలజనులను ఏకం చేసి తెలంగాణ ఉద్యమంలో ఉద్యమనేత కెసిఆర్‌కు శ్రీనివాస్‌గౌడ్ వెన్నుదన్నుగా నిలిచిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ సందర్భంగా రక్తదాన శిబిరంలో రక్తదానం చేసిన యువకులకు రాష్ట్ర ప్రభుత్వ రక్తనిధి కేంద్ర సంస్థ ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ సగర సంఘం అధ్యక్షుడు మోడల రవిసగర, కార్యనిర్వాహక కార్యదర్శి దిండి చెన్నయ్య సగర, గ్రేటర్ యువజన సంఘం అధ్యక్షుడు ఎర్రంశెట్టి సీతారాం సగర, ప్రధాన కార్యదర్శి గౌని సాయికుమార్ సగర, కోశాధికారి వేముల మహేశ్‌సగరలతో పాటు గుంటి వినోద్, దిండి సాయిబాబా, మోడల నర్సింహసగర, సూర రాజుసగర, వెంకటేష్ సగర, నీరడి శేఖర్ సగర పాల్గొన్నారు.

**కంటోన్మెంట్ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు**

**అల్వాల్, మార్చి 16 ప్రభాతవార్త:** కంటోన్మెంట్ బోర్డు ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందుతాయని మల్కాజిగిరి పార్లమెంట్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు మర్రి రాజశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. కంటోన్మెంట్ బోర్డు 4వ వార్డు మాజీ సభ్యురాలు నళిని కిరణ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిభిరాన్ని మర్రి రాజశేఖర్ రెడ్డి గురువారం సందర్శించడం జరిగింది. ప్రజలకు అవసరమైన వైద్య సేవలను అరుంధతి ఆసుపత్రి ఉచితంగా అందిస్తుందని ఆయన పేర్కొన్నారు. పురపాలక ఐటి శాఖ మంత్రి కెటిఆర్ స్ఫూర్తితో గిఫ్ట్ ఎ స్మైల్ కింద దాదాపు రెండు వేలు మందికి ఉచితంగా శస్త్ర చికిత్సలు చేశామని వివరించారు. ఆరుంధతి ఆసుపత్రి అందిస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ బోర్డు సభ్యుడు జక్కుల మహేశ్వర్ రెడ్డి పాండు యాదవ బిఆర్ఎస్ నేతలు పెద్దల నరసింహ ముప్పిడి మధుకర్ వినోద్ కుమార్ గాంధీ హట్స్ కాలనీ అధ్యక్షుడు రాజేంద్ర ప్రవీణ్‌యాదవ్ సురేష్ ఆశ సంగీత తదితరులు పాల్గొన్నారు.

**బిఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం**

**చార్మినార్,మార్చి 16 ప్రభాతవార్త :** బిఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమవుతుందని చార్మినార్ నియోజకవర్గం బిఆర్ఎస్ ఇంఛార్జి మహ్మద్ సలావుద్దీన్ లోధీ అన్నారు.నియోజక వర్గానికి చెందిన బిఆర్ఎస్ నాయకులు ఎస్.వి.గోపీనాథ్‌యాదవ్ గురువారం నియోజకవర్గం ఇంఛార్జి మహ్మద్ సలావుద్దీన్ లోధీని కలిశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోనినాయకులు, కార్యకర్తలు కలిసి పార్టీ పటిష్టత కోసం పాటు పడాలని కోరారు.ఫత్తర్‌గట్టి డివిజన్ ప్రధాన కార్యదర్శి మహ్మద్ సైపుద్దీన్ పాల్గొన్నారు.

## మనస్తాపంలో బాలుడు ఆత్మహత్య

**పేట్‌బషీరాబాద్,మార్చి16 ప్రభాతవార్త:** తండ్రి క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నాడని మనస్తాపం చెందిన కుమారుడు ఆతహత్య చేసుకున్న సంఘటన గురువారం పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. వివరాల్లోకి వెళితే.. బీహార్ రాష్ట్రానికి చెందిన ప్రియాన్షురాజ్(14) సుభాష్‌నగర్‌లో నివాసం ఉంటున్న తన మేనమామ అమిష్ కుమార్ దగ్గర ఉంటూ చదువుకుంటున్నాడు. తన తండ్రి 4సంవత్సరాలుగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతుండడంతో చికిత్స నిమిత్తం ముంబాయి వెళ్ళడానికి నిశ్చయించున్న తల్లి ప్రియాన్షురాజ్‌ను తన తమ్ముడైన అమిష్‌కుమార్ ఇంట్లో వదిలి వెళ్ళింది. దీంతో ప్రియాన్షురాజ్ నిత్యం తన తండ్రి క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ ఇబ్బందిపడుతున్నాడని చదువుపై కూడా దృష్టి పెట్టలేక ప్రతి రోజు మానసిక సంఘర్షణకు గరయ్యేవాడు. ఈ క్రమంలో గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో తన గదిలో చున్నీతో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి మేనమామ పేట్‌బషీరాబాద్ పోలీసులకు సమాచారం అందించి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

## వ్యక్తి అదృశ్యం

**పేట్‌బషీరాబాద్,మార్చి16 ప్రభాతవార్త:** స్నేహితుడి ఇంటికి వెళ్తున్నానని భార్యకు చెప్పి బయటకు వెళ్ళిన వ్యక్తి అదృశ్యమైన సంఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. మార్‌విండ్ మైఖేల్(36) వ్యాపారం చేసుకుంటూ పేట్‌బషీరాబాద్‌లోని ఎన్‌సీఎల్ అన్నుకోర్ట్‌యార్డ్ బి-బ్లాక్‌లో కుంటుంబంతో నివాసం ఉంటున్నాడు. బుధవారం సాయంత్రం సుమారు 7గంటల సమయంలో స్నేహితుడు నాని ఇంటికి వెళ్ళివస్తానని భార్య ప్రియాంకకు చెప్పి ఇంటి నుంచి బటయకు వెళ్ళాడు. అర్ధరాత్రి అవుతున్నా ఇంటికి రాకపోవడంతో కంగారు పడిన ప్రియాంక మైఖేల్ ఫోన్‌కు కాల్ చేయగా స్విచ్ ఆఫ్ అని వచ్చింది. వెంటనే తన భర్త స్నేహితుడైన నానికి కాల్ చేయగా తన వద్దకు రాలేదని చెప్పడంతో ప్రియాంక ఇంటి పరిసర ప్రాంతాల్లో,బంధువులు,సే స్నేహితుల వద్ద విచారించిన ఆచూకీ లభించలేదు. దీంతో ప్రియాంక తన భర్త కనిపించడంలేదని పేట్‌బషీరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఓయు ఉద్యోగి మృతి

**తార్నాక, మార్చి 16 ప్రభాతవార్త:** ఒయూలో పనిచేసే ఉద్యోగి రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన బైక్ డీకొనడంతో మృతి చెందాడు. ఈ సంఘటన ఉస్మానియా యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది.ఇన్స్‌పెక్టర్ ఎల్.రమేష్ నాయక్ కథనం ప్రకారం. ఓ.యూ ఎన్ఆర్ఎస్ హాస్టల్లో పనిచేసే అబ్దుల్ మోసిన్(64) గురువారం తార్నాక చౌరస్తాలోని సన్‌మాన్ హోటల్‌కు వచ్చి తిరిగి వెల్లుతుండగా మెట్టుగూడ నుంచి హబ్సిగూడ వైపు పల్సర్‌పై వెళ్లుతున్న యువకుడు వేగంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో మోసిన్ తలకు తీవ్రంగా గాయాలయ్యాయి. దీంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. బైక్‌పై వెళ్లుతున్న వ్యక్తికి కూడా గాయాలయ్యాయి. దీంతో విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వారిని గాంధీ హాస్పిటల్‌కు తరలించారు. కాగా మోసిన్ అప్పటికే మృతి చెందాడిన డాక్టర్లు నిర్ధారించారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


## CLASSIFIEDS

**CHANGE OF NAME**

★ I (MIDAY) **"M JAYAMA"** R/o.H.No.2-63, Aziznagar, Moinabad, R.R.Dist., T.S, Changed My Name As **"MADI MOUNIKA"** W/o. MADI MANIKYAREDDY .

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.

**IN THE COURT OF THE HON'BLE II ADDL. JUNIOR CIVIL JUDGE CUM-VI ADDL. METROPOLITAN MAGISTRATE MEDCHAL-MALKAJGIRI DISTRICT AT: L. B. NAGAR O.S. No. 986 of 2022**

Between :
1. **RASALA YADAGIRI** S/o. Late Rasala Balaiah, Aged about 44 years, Occ: Private Job.
2. **KUM. RASALA KUSUMA** D/o. R. Yadagiri, Aged about 19 years, Occ: Student.
3. **KUM. RASALA HARIKA** S/o. R. Yadagiri, Aged about 19 years, Occ: Student.
4. **Mr. RASALA HARINATH** S/o. Rasala Yadagiri, Aged about 15 years, Occ: Student.

(Plaintiff No.4 is a minor and that his father plaintiff No.1 is represented on behalf of him as a natural guardian) All R/o H.No.1-124, Anand Nagar Colony, Boduppal, Medipally Mandal, Medchal-Malkajgiri District, TS. **....PLAINTIFFS**

And

1. **The Tahasildar,** Boduppal, MRO, Medchal-Malkajgiri District, TS
2. **All concerned ...DEFENDANTS**

Whereas the above named Plaintiffs filed the above suit for Declare the Legal Heirs of Deceased Late SMT RASALA ANITHA. And the above matter is posted on - 03 - 2023 for appearance of any persons for objections. The Hon'ble Court was pleased to direct to take out notice through Paper Publication. Hence, take notice as the case is posted on - 03 - 2023 at 10.30 A.M. Kindly appear in persons or through your Counsel on the said date.

// BY ORDER OF THE COURT //

**Sd/- M/s. S. VENKATARAMANA D. VIJENDER Advocates**
H.No.1-9-114/1, KUSHAIGUDA, ECIL., HYDERABAD 500062. Ph. No. **9848275593.**

**IN THE COURT OF THE HON'BLE I ADDL. SENIOR CIVIL JUDGE MEDCHAL-MALKAJGIRI DISTRICT, AT MALKAJGIRI. O.S.No. 926 OF 2015**

Between:
**KOLA SHRAVANAI ...Plaintiff**
And
**Sri. KOLA SHIVKUMAR & OTHERS ...Defendants**

To,
**KOLA NAVYA D/o KOLA SHIVKUMAR,** R/o. 22-108/F 102, 1 Floor, Kamalapriya Nilayam, R.K. Nagar, Malkajgiri, Hyderabad-47.

Please take notice that the above mentioned Plaintiff has filed the above suit for Partition against you the other Defendants in respect of the Schedule Property mentioned in the suit and the **matter stands posted on 20.03.2023 for your appearance in person or through Advocate and to file the objections if any.** If you fail to appear on that said date, the matter will be decided exparte.

(By Order of the Hon'ble Court)

**Sd/- B. RATHNAKAR RAO Advocate**
H.No.24-22, Sivapuri, Malkajgiri, Hyderabad-500047. Phone Number: **9247483014.**

**IN THE COURT OF THE HON'BLE II ADDL JUNIOR CIVIL JUDGE CUM-VI ADDL. METROPOLITAN MAGISTRATE, MEDCHAL-MALKAJGIRI DISTRICT, UPPAL AT : L.B NAGAR O.S No. 176 OF 2023**

BETWEEN:
**Sri. Kaparaboina Sravan Kumar & ANR ...Plaintiffs/s**
AND
**The Tahsildar, Uppal Mandal & All Concerned ...Defendants/s**

The Plaintiff's herein have filed the above suit seeking declaration of Plaintiffs **Sri. Kaparaboina Sravan Kumar,** S/o. late Kaparaboina Venkata Narayana, and Smt. Yarraboina Sravanti, W/o. Yarraboina Sathish Kumar, D/o. late Kaparaboina Venkata Narayana, are the only legal heirs of the deceased, late Sri. Kaparaboina Venkata Narayana., R/o. H.No. 18-77/2/2, Venkata Sai Nagar, Uppal, K.V. Rangareddy-500039. The Hon'ble Court has directed the plaintiffs to issue publication, in "VARTHA NEWS PAPER" informing the same to public at large in connection with the said declaration. Any person having any kind of objections or interest in any manner with the said declaration may appear before the Hon'ble II ADDL JUNIOR CIVIL JUDGE CUM-VI ADDL. METRO POLITAN MAGISTRATE, MEDCHAL-MALKAJGIRI DISTRICT, UPPAL AT: L.B NAGAR in person or through legal counsel on 10-04-2023 at 10:30 A.M

// By order of the Honorable Court//

**D.C. Gehloth Advocate**
# F.No.202, Sri Venkata Ramana Appt, Thakur Mansion Lane, Adj. CMR Jewellry, Somajiguda, Hyderabad - 500082, T.S.

**IN THE COURT OF THE HON'BLE I ADDL. JUNIOR CIVIL JUDGE, AT: MALKAJGIRI O.S.No. 460 OF 2018**

Between:
**Sri Akula Aravind Kumar** ...Petitioner/Plaintiff
**AND**
**Smt. N. Shailaja and others** ...Respondents/Defendants

To,
1. **Smt. N. Shailaja,** W/o. Late M. Narender, Aged about 45 Yrs, Occ: Housewife, R/o. H.No. 1-11-183/A, B Creative Homes, Shyamlal Buildings, Begumpet, Hyderabad.
2. **Smt. N. Shiresha,** W/o. Sri. M. Anand Kumar, Aged about 39 Yrs, Occ; Housewife, R/o. H.No. 1-8-13/7, Ravindra Nagar, Ramanthapur, Hyderabad. ...Respondents/Defendants No. 1 and 2

**NOTICE**

Please take notice, that the above case is filed by the Petitioner/Plaintiff against Respondents/Defendants for your appearance either by you personally or through your counsel on the above said date before the Hon'ble Court on **31.03.2023** at 10.30 A.M. If your fail to appear the above case will be decided as per law. Hence this Notice.

**( By order of the Court)**

Sd/- **V. SRIKANTH, K. ROHIT,** Advocates, H.No. 1-1-65, Santosh Nagar, Malkajgiri, Hyderabad-500047. Cell: 98490 39638

# ఉప్పల్ సర్కిల్‌లో అధ్వాన్నంగా ఓపెన్ జిమ్స్ నిర్వహణ

## అర్భాటంగా జిమ్‌ల ఏర్పాటు : శిథిలావస్థకు చేరిన పరికరాలు



ఉప్పల్ స్టేడియంలో శిథిలావస్థలో తుప్పు పట్టిన ఓపెన్ జిమ్



రామంతాపూర్ చిన్న చెరువు వద్ద విరిగిపోయి అధ్వాన్నంగా తయారైన ఓపెన్ జిమ్ పరికరాలు దృశ్యం.

**ఉప్పల్, మార్చి 16 ప్రభాతవార్త :** గ్రేటర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో యువతీ, యువకులు, వృద్ధులు, మహిళల శారీరకంగా, దారుఢ్యం కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్ పరికరాలు తుప్పుపట్టిపోతున్నాయి. ఓపెన్ జిమ్ ఏర్పాటు చేసిన 6 నెలలకే పలు చోట్ల శిథిలావస్థకు చేరగా వీటి నిర్వహణ అధికారులు గాలికి వదిలివేశారు. ఉప్పల్ సర్కిల్‌లో ఒక్కో డివిజన్‌లో రూ.పది లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన జిమ్ పరికరాలు కాంట్రాక్టర్లకు కాసులు కురిపించగా, అధికారులు మొద్దు నిద్ర నటిస్తూ వీటిపై పట్టించుకోవడం లేదు. వివరాలు ఇలా ఉన్నాయి. ఉప్పల్ సర్కిల్‌లో గత ఏడాది క్రితం ఒక్కో డివిజన్‌లో రూ.పది లక్షల వ్యయంతో ఒపెన్ జిమ్‌లు ఏర్పాటు చేశారు. ఉప్పల్ సర్కిల్ పరిధిలోని ఉప్పల్, రామంతాపూర్, హబ్సిగూడ, చిలుకానగర్ డివిజన్‌లో ఒక్కోటి చొప్పున వీటిని ఏర్పాటు చేశారు. ఉప్పల్ మున్సిపల్ స్టేడియం, రామంతాపూర్ చిన్న చెరువు, హబ్సిగూడ వీర రాజిరెడ్డి పార్కు, ఉప్పల్ డివిజన్‌లో వీటిని ఏర్పాటు చేశారు. స్థానిక కమ్యూనిటిహాల్స్, పబ్లిక్ స్థలాల్లో వీటిని ఏర్పాటు చేయగా, వీటిని ఏర్పాటు చేసిన కొద్ది రోజులకే శిథిలావస్థకు చేరి తప్పుపట్టిపోతున్నాయి. ఉప్పల్ మున్సిపల్ స్టేడియంలో పరికరాల బోల్టులు ఊడిపోయి పనికిరాకుండా పోతున్నాయి. ఉదయం, సాయంత్రం ఎంతో మంది చిన్నారులు, యువతీ, యువకులు వీటిని ఉపయోగించుకుంటుండగా నిర్వహణ సరిగ్గా లేకపోవడంపై తీవ్ర అంసతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రామంతాపూర్ చిన్న చెరువు వద్ద ఏర్పాటు చేసిన ఒపెన్ జిమ్ పరికరాలను కొద్ది రోజుల క్రితం ఒక కారు ఢీకొట్టింది. దీంతో కొన్ని పరికరాలు వంగిపోయాయి. మరికొన్ని ఊడిపోయాయి. వీటిని స్థానికంగా ఉంటున్న కొందరు విక్రయించినట్లు విమర్శలున్నాయి. అధికారులకు ఫిర్యాదుచేసినా పట్టించుకోవడం లేదని సిపిఎం నేత ఎర్రం శ్రీనివాస్ పేర్కొన్నారు. గత కౌన్సిల్ హయాంలో కూడా పలు చోట్ల కమ్యూనిటి హాల్స్‌లో జిమ్‌లు ఏర్పాటు చేయగా, చాలా చోట్ల పరికరాలు ఎన్ని ఉన్నాయో, ఎన్ని పోయాయో అధికారులకు తెలియకుండా ఉంది. పరికరాల లెక్కలు కూడా అధికారులు వద్ద లేకపోవడం గమన్హారం.

**ఒపెన్ జిమ్‌ల నిర్వహణ పట్టని అధికారులు..!** ఉప్పల్ సర్కిల్‌లో ఒపెన్ జిమ్‌లతోపాటు, కమ్యూనిటిహాల్స్‌లో ఏర్పాటు చేసిన జిమ్‌ల నిర్వహణ అధికారులకు పట్టడం లేదు. ఇంజనీరింగ్, స్పోర్ట్స్ అధికారుల మధ్య సమన్వయలోపం కారణంగా పలు చోట్ల జిమ్‌ల గురించి ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడం లేదు.

ఫిర్యాదులు వచ్చిన సమయంలో హడావిడి చేయడం, తిరిగి వీటి గురించి పట్టించుకోకపోవడం పరిపాటిగా మారింది. జిమ్‌ల నిర్వహణపై నేరుగా కమిషనర్‌కు ఫిర్యాదుచేసినా పట్టించుకోవడంలేదని సిపి ఎం నేత ఎర్రం శ్రీనివాస్ ఆరోపించారు. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# కలుషితం అవుతున్న మంచినీరు - దశాబ్దం క్రితం నాటి పైప్ లైన్లు

## ఫిర్యాదులు చేసిన పట్టించుకోని అధికారులు - పెద్ద సంఘటనలు జరిగితేనే హడావిడి





మురికి నీరు చూపిస్తున్న మహిళలు

మురికి నీటిని పరిశీలిస్తున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

**ఎల్.బి.నగర్, మార్చి 16 ప్రభాతవార్త :** మంచినీరు కలిసి కలుషితమై ప్రజలు అనారోగ్యం పాలవుతున్న జలమండలి అధికారులు పట్టించుకోవడంలేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. డ్రైనేజీనీరు మంచినీటిలో కలిసి మంచినీరు కలుషితమవుతున్న విషయాన్ని అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పెడచెవిన పెడుతున్నారని అధికారుల తీరుపై కాలనీవాసులు మండిపడుతున్నారు. నగరంలో పలుసార్లు మంచినీరు కలుషితమై అనేకమంది ప్రాణాలు కూడా కోల్పోయారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని జలమండలి అధికారులు ముందస్తు చర్యలు చేపట్టడంలో పూర్తిగా విఫలమవుతున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కొత్తపేట డివిజన్ మోహన్‌నగర్‌కాలనీలో మూడురోజుల నుంచి మంచినీరు కలుషితమవుతోంది. మంచినీటి పైపు నుంచి పూర్తిగా డ్రైనేజీ మురికినీరు వస్తున్నాయని కాలనీవాసులు స్థానిక కార్పొరేటర్ పవన్‌కుమార్ దృష్టికి తీసుకువెళ్లారు. సమాచారం తెలుసుకున్న కార్పొరేటర్ మోహన్‌నగర్‌లోని బస్తీలోకి వచ్చి మురికినీరు పరిస్థితిని పరిశీలించి ఆవేదన వ్యక్తం చేశారు. బస్తీలో మంచినీటికి బదులుగా పూర్తిగా మురికినీరు సరఫరా అవుతున్న విషయాన్ని జలమండలి అధికారుల దృష్టికి తీసుకువెళ్లిన సరైన చర్యలు చేపట్టడం లేదని బస్తివాసులు కార్పొరేటర్‌కు వివరించారు. మంచినీళ్లు లేక ప్రజలు ఇబ్బందులు పడుతుండటంతో సమస్య కార్పొరేటర్ వెంటనే సంబంధిత జలమండలి సూపర్వైజర్లు ఆరిఫ్, దయాకర్, సత్యనారాయణను పిలిపించి సమస్యను వారికి చూపించారు. కొన్ని రోజుల నుంచి మోహన్‌నగర్ బస్తీలో డ్రైనేజీనీరు త్రాగునీటిలో కలుస్తుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, తాగునీటిలో కలిసిన డ్రైనేజి మురికినీటిని సూపర్వైజర్లకు చూపించారు. కొత్తపేట డివిజన్లో వరుసగా డ్రైనేజి నీళ్ల పొల్యూషన్ అవుతున్నాయని అధికారులు పట్టించుకోవడం లేదని, దశాబ్దాల క్రితం వేసిన డ్రైనేజిలైన్లు, వాటర్‌లైన్లు పాడైపోయి త్రాగునీటిలో కలవడం వల్ల మంచినీరు పూర్తిగా కలుషితమై ప్రజల ప్రాణాలమీదికి తీసుకువస్తుందని బస్తీలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

జలమండలి అధికారులు డ్రైనేజీ మంచినీరు పైప్‌లైన్లను పూర్తిగా తొలగించి నూతన పైప్‌లైన్లను ఏర్పాటు చేయాలని బస్తివాసులో డిమాండ్ చేస్తున్నారు. బస్తీవాసులకు ఇబ్బందులు కలవకుండా ప్రతిరోజు టాంకర్ల ద్వారా మంచి నీరు అందించాలని కార్పొరేటర్ సూచించారు. అధికారులు సమస్యపై వెంటనే స్పందించి అవసరమైన చర్యలు తీసుకొని మంచినీరు కలుషితం కాకుండా ప్రజల ప్రాణాలు కాపాడాలని కార్పొరేటర్ విజ్ఞప్తి చేశారు.

# ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలి : ఎమ్మెల్యే



రివ్యూ సమావేశంలో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి తదితరులు

**వనస్థలిపురం, మార్చి 16 ప్రభాతవార్త :** ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎల్‌బి నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి వైద్యులకు సూచించారు. వనస్థలిపురం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో గురువారం జరిగిన రివ్యూ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హరిప్రియ ఆసుపత్రిలో మంచినీటి సౌకర్యం కల్పించాలని అదేవిధంగా లిఫ్ట్ సౌకర్యం లేక డయాలసిస్ వచ్చే రోగులు ఇబ్బందులు పడుతున్నారని వెంటనే లిఫ్ట్ సౌకర్యం కల్పించాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. అందుకు స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆసుపత్రికి మంచినీటి సరఫరాకోసం సంబంధిత మంత్రితో చర్చించి మంచినీటి సమస్యను తీరుస్తామన్నారు. అదేవిధంగా లిఫ్ట్ ఏర్పాటు గురించి మెడికల్ అండ్ హెల్త్ ప్రిన్సిపల్ సెక్రటరీ రిజ్వితో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు ఇబ్బందులు కలుగకుండ, మందులు అందుబాటులో ఉంచి, మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది రాజన్, గఫార్, ఈశ్వరమ్మ, సునీత, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రగతినగర్‌లో త్వరలో కొత్త డ్రైనేజీ లైన్లు : కార్పొరేటర్ శ్రీవాణి



సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ శ్రీవాణి తదితరులు

**రామంతాపూర్, మార్చి 16 ప్రభాతవార్త :** రామంతాపూర్ ప్రగతినగర్ కాలనీలో కొత్త డ్రైనేజీ లైన్లు వేసేందుకు తగు చర్యలు తీసుకుంటున్నట్లు కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్రావ్ పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం జలమండలి మేనేజర్ రవీందర్, సూపర్‌వైజర్ కిషన్ తదితరులతో కలిసి పలు ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ శ్రీవాణి వెంకట్రావ్ మాట్లాడుతూ డివిజన్‌లో ప్రజలకు మౌళిక సదుపాయాలు కల్పించేందుకు తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. పెండింగ్‌లో ఉన్న డ్రైనేజీ లైన్లు వేసేందుకు తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. త్వరలోనే పనులు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బిజెపి డివిజన్ అధ్యక్షుడు బండారు వెంకట్రావ్, కాలనీ అధ్యక్షుడు బి.వెంకట్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలి : ఎమ్మెల్యే బలాల



కంటి అద్దాలను అందజేస్తున్న ఎమ్మెల్యే బలాల

**మలక్‌పేట, మార్చి 16 ప్రభాతవార్త :** ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల పేర్కొన్నారు. ఓల్డ్ మలక్‌పేట డివిజన్‌లోని శంకర్‌నగర్‌లో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కేంద్రాన్ని ఎమ్మెల్యే బలాల ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు కంటి వెలుగు పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నియోజకవర్గంలోని ప్రతి డివిజన్‌లో కంటి వెలుగు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మలక్‌పేట క్లస్టర్ వైద్యాధికారి డాక్టర్ బ్రిజున్నిసా, నాయకులు సైపుద్దీన్ షఫీ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# గీత కార్మికుల సంక్షేమానికి మంత్రి శ్రీనివాస్‌గౌడ్ కృషి



ఉప్పల్‌లో జరిగిన సమావేశంలో ప్రసంగిస్తున్న గౌడ సంఘం నేతలు రామరావుగౌడ్, కృష్ణగౌడ్, రమేష్‌గౌడ్ తదితరులు

**ఉప్పల్, మార్చి 16 ప్రభాతవార్త :** రాష్ట్రంలో గీత కార్మికుల సంక్షేమానికి మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఎంతో కృషి చేస్తున్నారని పలువురు గౌడ సంఘం నేతలు పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఉప్పల్ ప్రెస్ క్లబ్‌లో ఉప్పల్ గీత పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు బింగి బిక్షపతిగౌడ్ ఆధ్వర్యంలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమానికి ఒయు జెఏసి నాయకుడు డా.వట్టికూటి రామరావుగౌడ్ ముఖ్య అతిధిగా పాల్గొని ప్రసంగించారు. తెలంగాణ ప్రభుత్వంలో మంత్రి శ్రీనివాస్ గౌడ్ సహకారంతో గౌడ కులస్థుల ఆత్మగౌరవాన్ని పెంపొందించేందుకు ఎంతో కృషి చేసినట్లు తెలిపారు. ట్యాంక్‌బండ్ పై రూ.25 కోట్లతో నీరా కెఫ్‌ను ప్రారంభించారని, కరోనా కష్టకాలంలో గౌడ కులస్థులకు ప్రభుత్వం అండగా నిలిచిందన్నారు. సర్వాయి పాపన్నగౌడ్ జయంతిని అధికారికంగా నిర్వహించడంతోపాటు, గౌడ భవన నిర్మాణానికి రూ.5 కోట్లు కేటాయించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ గౌడ సంఘం నేతలు మీనంపల్లి కృష్ణ, బొంగు రమేష్‌గౌడ్, మద్దేల శివరాజ్‌గౌడ్, బూత్కూరి కృష్ణగౌడ్, పోతగోని నగేష్ గౌడ్, పండ్ల శ్రీనివాస్‌గౌడ్, బందారం లక్ష్మణ్‌గౌడ్, పబ్బు అయోధ్యగౌడ్, ఎల్లగోని ప్రకాష్‌గౌడ్, పండ్ల కిషన్‌గౌడ్, బూత్కూరి నవీన్‌గౌడ్, మీనంపల్లి నవీన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆయుష్మాన్ భారత్‌ను సద్వినియోగం చేసుకోవాలి : కార్పొరేటర్ భాగ్యలక్ష్మి



ఎన్‌రోల్‌మెంట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మి

**మలక్‌పేట, మార్చి 16 ప్రభాతవార్త :** ప్రధానమంత్రి ఆయుష్మాన్ భారత్ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మూసారాంబాగ్ డివవిజన్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. మూసారాంబాగ్ డివిజన్‌లోని ప్రభుత్వ గ్రంథాలయంలో కార్పొరేటర్ భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో ఆయుష్మాన్ భారత్ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ పథకం గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో ఆయుష్మాన్ భారత్ పథకం డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో ఆయుష్మాన్ భారత్ పథకం నమోదు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రమేష్‌రెడ్డి, దేవేందర్, వరప్రసాద్, కొప్పుల దినేష్, చందు, సందీప్, సంతోష్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# ముగిసిన శ్రీ శారదా లక్ష్మీ నర్సింహా స్వామి బ్రహ్మోత్సవాలు



బ్రహోత్సవాలకు హాజరైన కార్తీక్‌రెడ్డి

**సరూర్‌నగర్, మార్చి 16 ప్రభాతవార్త:** మీర్‌పేట్ కార్పొరేషన్ లోని జిల్లెలగూడ ఒల్డ్ గాయత్రీనగర్‌లో శ్రీ శారదా లక్ష్మీ నర్సింహ స్వామి పంచమ వార్షిక బ్రహోత్సవాలు వైభవంగా ముగిసాయి. స్వయం ప్రకాశ సచ్చితానంద సరస్వతీ మహాస్వామి మంగళ శాసనములతో స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలను నిర్వహించారు. ఇందులో భాగంగా స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. కాగా ఉత్సవాల ముగింపు సందర్భంగా స్వర్గీయ ఇంద్రారెడ్డి ట్రస్ట్ ఛైర్మన్, బిఆర్ఎస్ యువనాయకుడు పి.కార్తీక్‌రెడ్డి హాజరై స్వామి వారికి పూజలు చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్‌రెడ్డి, వంటేరు నర్సింహారెడ్డి తదితరుల ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ ఉత్సవాల్లో మీర్‌పేట్ డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, అర్కల భూపాల్‌రెడ్డి, గజ్జెల రాంచందర్, ఎనుగుల అనిల్ యాదవ్, అర్కల కామేష్‌రెడ్డి, లంకాల రమేష్‌రెడ్డి, ఇంద్రసేనారెడ్డి, సుదర్శన్‌రెడ్డిలతో పాటు పలువురు పాల్గొన్నారు.

# శ్రీ మహంకాళి, శ్రీరామ మందిరం వార్షిక బ్రహ్మోత్సవాలు

**ఉప్పల్, మార్చి 16 ప్రభాతవార్త :** హబ్సిగూడలోని శ్రీ మహంకాళి, శ్రీరామ మందిరం ద్వితీయ వార్షిక బ్రహ్మోత్సవాలకు ఆలయాన్ని అంగరంగ ముస్తాబు చేస్తున్నారు. ఉత్సవాల సందర్భంగా ఆలయంలో వివిధ ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయకమిటి మాజీ చైర్మన్ గాయం శ్రీధర్‌రెడ్డి, కార్యనిర్వహణ అధికారి ఎల్.భాగ్యలక్ష్మి, అర్చకులు గట్టు శ్రీనివాసాచార్యులు తెలిపారు. ఈనెల 28 నుంచి 31వరకు స్వామి ఉత్సవాలు జరుగుతాయని వారు తెలిపారు. ఈనెల 28న సాయంత్రం విష్ణు సహస్రనామ పారాయణము, విష్యకేన ఆరాధన, పుణ్యావాహచనం, దీక్షాస్వీకారం, అంకురార్పణ, తీర్థ ప్రసాద గోష్టి, ఈనెల 29న సుప్రభాత సేవ, తిరుప్పావై సేవాక్కాలం, యాగశాల ప్రవేశం, శాంతిపాఠం, యాగ మంటప ఆరాధన, మహాకుంభస్థాపన, మూలమంత్ర, మూర్తి మంత్ర హవణము, గరుడాధి వాసము, సధ్యపూర్ణాహుతి, ధ్వజారోహణ, గరుడముద్ద, బలిహారణ, ఆరగింపు, తీర్థ ప్రసాద గోష్టి, సాయంత్రం విష్ణుసహస్రనామ పారాయణం, హోమము బలిహారణ, ఎదుర్కొళ్ళ మహోత్సవం, నాధస్వర కచేరి, ఆరగింపు, తీర్థప్రసాద గోష్టి ఉంటుందని తెలిపారు. అదే విధంగా ఈనెల 30 తేదిన ఉదయం సుప్రభాత సేవ, తిరుప్పావై సేవాకాలం, శాంతిపాఠం, హోమము, బలిహారణము, అనంతరం సీతారామచంద్రస్వామి కల్యాణ మహోత్సవం ఉంటుందని తెలిపారు. సాయంత్రం శ్రీ విష్ణుసహస్ర పారాయణము, హోమము, బలిహారణం, తీర్థప్రసాద గోష్టి, ఈనెల 31న సుప్రభాత సేవ, తిరుప్పావే సేవాకాలం, శాంతి పాఠం, నిత్యనిధి ఆరాధన, మహాపూర్ణాహుతి, బలిహారణ, చక్రతీర్థం, ధ్వజాఅవరోహణం, సీతారామచంద్రస్వామి పట్టాభిషేకం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి మంత్రులు ఎ.ఇంద్రకరణ్‌రెడ్డి, మల్లారెడ్డి, ఎంపి రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, కార్పొరేటర్ కక్కిరేణి చేతన తదితరులు పాల్గొంటారని తెలిపారు.

# మంత్రి సబితారెడ్డికి ఇందిరా గాంధీ సొసైటీ ప్రజల కృతజ్ఞతలు



పైప్‌లైన్ పనులను పరిశీలిస్తున్న కౌన్సిలర్ లక్ష్మీనారాయణ

**సరూర్‌నగర్, మార్చి 16 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గంలోని జల్‌పల్లి మున్సిపాలిటీ 18వవార్డులో ప్రతి ఇంటికి తాగు నీటిని సరఫరా చేయించడానికి నూతనంగా పైప్‌లైన్లు ఏర్పాటు చేయిస్తున్న రాష్ట్ర విద్యాశాఖ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డికి స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. వార్డులోని ఇందిరాగాంధీ సొసైటీలో ఏర్పాటు చేస్తున్న పైప్‌లైన్ పనులను గురువారం స్థానిక కౌన్సిలర్ కెంచ లక్ష్మీనారాయణ పర్యవేక్షించారు. ఈ మేరకు స్థానికులు పైప్‌లైన్ పనుల పట్ల హర్షం వ్యక్తం చేసి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ మంత్రి ఆదేశాలతో పైప్‌లైన్ పనులను సకాలంలో పూర్తి చేయించి ఈ వేసవిలో నీటి సమస్యలు లేకుండా చూస్తామని తెలిపారు.

# కంటి వెలుగును ఉపయోగించుకోవాలి : కార్పొరేటర్ బాలమణి



కంటి వెలుగును ప్రారంభించిన కార్పొరేటర్ బైగళ్ళ బాలమణి

**సరూర్‌నగర్, మార్చి 16 ప్రభాతవార్త:** మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని 19వడివిజన్‌లో నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని డివిజన్ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని స్థానిక కార్పొరేటర్ బైగళ్ళ బాలమణి కోరారు. బుధవారం ఆమె డివిజన్‌లోని ఈస్ట్‌గాయత్రీనగర్ కాలనీ సంక్షేమ సంఘం భవనంలో ఏర్పాటైన కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కంటి వెలుగు బృహత్తర కార్యక్రమమనీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి సూచనల మేరకు ప్రజలు ఈ కార్యక్రమాన్ని ఉపయోగించుకొని దృష్టి సమస్యలను నివారించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు కొత్త వెంకటయ్య, శ్రీరాం నాయక్, లక్ష్మణ్, బైగళ్ళ ఓం ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఉద్యోగిని అడ్డుకున్న వ్యక్తికి స్వచ్ఛ భారత్ శిక్ష



ప్రభుత్వ ఉద్యోగిని అడ్డుకున్న వ్యక్తితో స్వచ్ఛ భారత్ చేయిస్తున్న ఉప్పల్ పోలీసులు దృశ్యం.

**ఉప్పల్, మార్చి 16 ప్రభాతవార్త :** విధి నిర్వహణలో ఉన్న ప్రభుత్వ ఉద్యోగి పట్ల క్రమరహితంగా వ్యవహరించిన ఒక వ్యక్తికి కోర్టు మూడు రోజుల స్వచ్ఛ భారత్ శిక్ష విధించినట్లు ఉప్పల్ ఎస్ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఉప్పల్ భరత్‌నగర్‌కు చెందిన చిందం బాలమల్లేష్ ప్రధాన రహదారిలో జరిగిన సంఘటన వద్ద విధి నిర్వహణలో ఉన్న ఉద్యోగులతో క్రమరహితంగా వ్యవహరించడంతో పాటు, ఉద్యోగి పట్ల అభ్యంతరకరంగా వ్యవహరించినట్లు తెలిపారు. దీంతో అతనిని అదుపులోకి తీసుకుని కోర్టులో ప్రవేశపెట్టగా మూడు రోజుల పాటు ఉప్పల్ పోలీస్‌స్టేషన్‌లో స్వచ్ఛ భారత్ చేయాలని ఆదేశించినట్లు తెలిపారు. ఉప్పల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# మాసబ్ చెరువులో మట్టివేసి పూడ్చిన వారిపై కఠిన చర్యలు



మాసబ్ చెరువును పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

**తుర్కయాంజాల్, మార్చి 16 ప్రభాతవార్త :** మాసబ్ చెరువు పరిరక్షణకుకట్టుబడి ఉన్నామని ఇరిగేషన్ డీఈఈ ఉషారాణి, ఏఈఈ గంగ, అబ్దుల్లాపూర్మెట్ తహశీల్దార్ అనితారెడ్డిలు పేర్కొన్నారు. గురువారం చెరువులో డంప్ చేసిన మట్టిని తొలగించే పనులను వారు పరిశీలించారు. మట్టి డంప్ చేసిన ప్రాంతాన్ని పరిశీలించి, పూర్తిగా తొలగిస్తామని పేర్కొన్నారు. మాసబ్ చెరువులో డంప్ చేసిన మట్టిని తొలగించే పనులను వేగంగా చేపడుతుండటంతో స్థానికులు హర్షం వ్యక్తంచేసారు. మాసబ్ చెరువును కబ్జా చేసిన వారిపై చర్యలు తప్పవని.... తహసిల్దార్ అనితారెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చెరువులో మొరం మట్టి నింపి చెరువును పూడ్చిన వారిపై ప్రబుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. చెరువులో పోసిన మట్టిని వెంటనే తొలగించి, చెరువు సర్వే చేసి వెంటనే హద్దురాలను ఏర్పాటు చేయిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ ఐ బిక్షపతి, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

# కంటి వెలుగు శిబిరాన్ని సందర్శించిన శ్రీలత శోభన్‌రెడ్డి



మహిళలకు కళ్లద్దాలను అందజేస్తున్న శ్రీలతశోభన్‌రెడ్డి

**తార్నాక, మార్చి 16 ప్రభాతవార్త :** మాణికేశ్వరీగర్ బస్తీలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని గ్రేటర్ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి,బీఆర్ఎస్ కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షులు మోతెశోభన్‌రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా వారు రోగులతో మాట్లాడి ఏమైనా ఇబ్బందులు ఉన్నాయని తెలుసుకున్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ కార్మికుల క్షేమం కోసం కంటి వెలుగును ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇప్పటి వరకు ఎంతో మంది ఈ కంటి వెలుగును సద్వినియోగం చేసుకున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జింకల మల్లేష్, బీఆర్ఎస్ కార్మిక విభాగం గ్రేటర్ అధ్యక్షులు వరికుప్పల్ శ్యామ్, హరి, ఆనందం, పాష, యాకూబ్, నటరాజ్, హుస్సేన్, కెకెతో పాటు పలువురు పాల్గొన్నారు.

# ఉప్పల్ టిఎక్స్ ఆసుపత్రిలో అరుదైన ఆపరేషన్



ఉప్పల్ టిఎక్స్ ఆసుపత్రిలో రైతుకు అరుదైన అపరేషన్ చేసిన వైద్యుల బృందం

**ఉప్పల్, మార్చి 16 ప్రభాతవార్త :** ఉప్పల్ టిఎక్స్ ఆసుపత్రి వైద్యులు ఖమ్మం జిల్లాకు చెందిన ఒక రైతుకు అరుదైన ఆపరేషన్ విజయవంతంగా నిర్వహించారు. ఈ మేరకు గురువారం ఉప్పల్‌లోని ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆసుపత్రి సిఒఒ డా.శ్రీకాంత్ వోద్నాల, అంకాలజిస్ట్ డా.చంద్రశేఖర్ అజాద్, సర్జికల్ గ్యాస్ట్రోఎంట్రాలజిస్ట్ సుదర్శన్, డా.అమర్నాద్‌రెడ్డి, డా.శ్రావణి, పిజిషియన్ డా.త్రివిక్రమ్, పల్మనాలజిస్ట్ డా.సతీష్ మాట్లాడుతూ తూర్పు హైదరాబాద్ లోనే మొదటిసారిగా టిఎక్స్ ఆసుపత్రిలో క్లిష్టమైన హైపెక్ సర్జరీ విజయవంతంగా పూర్తి చేసినట్లు తెలిపారు. సూడోమిక్సోమ పెరిటోమై అనే అరుదైన వ్యాధి సోకిన రైతుకు 17 గంటలపాటు వైద్యులు శ్రమించి విజయవంతంగా చికిత్స చేసినట్లు తెలిపారు. పది లక్షల మందిలో ఒకరికి ఇటువంటి వ్యాధి వస్తుందని, శస్త్ర చికిత్స చేసేందుకు పెరిటోనెక్టోమీ, లివర్ వెడ్జ్ రిసెక్షన్, కోలెసిస్టెక్టొమి, గ్యాస్ట్రెక్టమి, స్ప్లెనెక్టోమి, జెజునల్ రెసెక్షన్, టోటల్ కొలెక్టొమి, గ్యాస్ట్రోజెజునోస్టోమి, ఇలియోరెక్టల్ అనస్టోమోసిస్ తదితర హైపర్ తెర్మిక్ ఇంట్రాపెరిటోనియల్ కిమోదెరఫీ లాంటి సర్జరీలు చేసినట్లు తెలిపారు. ఈనెల 5వ తేదిన ఆపరేషన్ నిర్వహించి 16వ తేదిన డిశార్జీ చేసినట్లు తెలిపారు. విజయవంతంగా ఆపరేషన్ నిర్వహించిన వైద్యులకు రైతు కుటుంబ సభ్యులు అభినందించారు. ఈ కార్యక్రమంలో పలువురు వైద్యులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# కాన్షీరాం చేసిన సేవలు ఎనలేనివి : అడపు లక్ష్మణ్



సమావేశంలో ప్రసంగిస్తున్న లక్ష్మణ్ తదితరులు

**మలక్‌పేట, మార్చి 16 ప్రభాతవార్త :** కాన్షీరాం దేశ ప్రజలకోసం, బహుజన సమాజం కోసం చేసిన సేవలు ఎనలేనిదని మలక్‌పేట నియోజకవర్గం బహుజన సమాజ్ పార్టీ అధ్యక్షుడు అడపు లక్ష్మణ్ పేర్కొన్నారు. మూసారాంబాగ్‌లో ఆయన ఆధ్వర్యంలో కాన్షీరాంజయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పేద, బడుగు వర్గాల సంక్షేమంకోసం ఆయన ఎంతో కృషి చేసారని అన్నారు. ఈ కార్యక్రమంలో సౌత్ జోన్ తెలంగాణ కన్వీనర్ శైలజ, హైదరాబాద్ జిల్లా ఇంఛార్జి రమేష్, ఉపాధ్యక్షులు శ్రీని, నియోజకవర్గ బివిఎఫ్ కన్వీనర్ సుమన్‌దాస్, అజార్ ఆలం, ఇమ్రాన్‌ఖాన్, మహేష్, దశరథ్, సూరి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# కార్మికులకు ఒక పూట పని విధానాన్ని అమలు చేయాలి: సిఐటియు

**సరూర్‌నగర్, మార్చి 16 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు ఒక పూట పని విధానాన్ని అమలుచేసి సమస్యలను తీర్చాలని బాలాపూర్ మండల సిఐటియు కన్వీనర్ దాసరి బాబు కమీషనర్ కృష్ణ మోహన్‌రెడ్డిని కోరారు. ఈ మేరకు గురువారం ఆయన కమీషనర్‌కు వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా బాబు మాట్లాడుతూ కార్మికులు ప్రతి రోజూ రెండు షిప్టుల్లో పని చేస్తున్నారనీ వారు శారీరక, మానసిక ఇబ్బందులకు గురవుతున్నందున కార్మికులను షిప్టుల పద్ధతిలో పని చేయించి ఆదివారం సెలవు ఇవ్వాలన్నారు. అదే విధంగా వారికి ఇవ్వాల్సిన కనీస నిత్యావసర వస్తువులను, దుస్తులు, పాద రక్షలు సక్రమంగా అందేవిధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మాదిరిగానే తెలంగాణలోని మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం నెలకు రూ.21 వేలు ఇవ్వాలనే తమ డిమాండ్‌ను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. అదే విధంగా అక్కడ ప్రమాద బీమా రూ.6 లక్షలు చెల్లిస్తున్నట్లే మన రాష్ట్రంలో కూడా ఇవ్వాలనే తమ సూచనను ప్రభుత్వానికి నివేదించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించే విధంగా పర్మినెంట్ చేసి ఇఎస్ఐ, పిఎఫ్ సౌకర్యం కల్పించాలని ఆయన అన్నారు.

# బహుజనులకు రాజ్యాధికారమే బిఎస్‌పి లక్ష్యం: గుడ్ల శ్రీనివాస్



ప్రసంగిస్తున్న బిఎస్‌పి నియోజకవర్గ అధ్యక్షుడు గుడ్ల శ్రీనివాస్

**సరూర్‌నగర్, మార్చి 16 ప్రభాతవార్త:** బహుజనులను రాజ్యాధికారమే బిఎస్‌పి లక్ష్యమని మహేశ్వరం నియోజకవర్గ బిఎస్‌పి అధ్యక్షుడు గుడ్ల శ్రీనివాస్ అన్నారు. మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని జిల్లెలగూడలో బుధవారం రాత్రి జరిగిన కాన్షీరాం జయంతి కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహుజనుల్లో రాజ్యాధికార చైతన్యాన్ని రగిల్చిన కాన్షీరాం ఆశయ సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణలో బహుజన రాజ్యాధికారం కోసం పని చేస్తున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు అండగా నిలవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో భాగ్యరాజ్, ఇందుమతి, దాసరి కిరణ్, శివకాంత్, అంజన్‌కుమార్, గుడ్ల జ్ఞానేశ్వర్, శ్రీను, విజయ్, లక్ష్మణ్, యెల్లయ్య, పలువురు మహిళలు పాల్గొన్నారు.